## దుంగలతో సహా ఎర్రస్మగ్లర్ పట్టివేత

యర్రావారిపాలెం, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త



భాకరాపేట అటవీ రేంజ్‌లో ఒక ఎర్రచందనం స్మగ్లర్‌తో సహా దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు అటవీ అధికారి సల్లావుద్దీన్ తెలిపారు. ఆయన తెలిపిన మేరకు నెరబైలు పరిధిలోని తలకోన కేసురాళ్ల బండ వద్ద సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో అటవీ సిబ్బందిని చూసి ఒక వ్యక్తి పారిపోయాడు. వెంటనే అతన్ని పట్టుకుని విచారించగా దగ్గరలోని 200 కిలోల బరువైన ఎర్రచందనం దుంగలు బయటపడ్డాయి. అతని పేరు పొన్నుస్వామి తమిళనాడు రాష్ట్రంగా గుర్తించి కేసు నమోదు చేసినట్లు ఆయన చెప్పారు. ఈ తనిఖీలలో అటవీ సిబ్బంది నిఖిత్, రాజేష్, ప్రదీప్‌చాంద్, సదాశివయ్య, ప్రదీప్‌కుమార్, పి.సురేష్, లోకనాథం, శంకర్‌లు పాల్గొన్నారు.




## అమృత్‌భారత్ స్టేషన్ పథకంలో కుప్పం రైల్వేస్టేషన్



కుప్పం, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త

కేంద్ర ప్రభుత్వం అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా దేశంలో ఎంపిక చేసిన 1275 రైల్వేస్టేషన్లను అభివృద్ధి చేయనుంది. ఈ పథకంలో కుప్పం రైల్వేస్టేషన్‌కు సైతం కేంద్రం చోటు కల్పించింది. అమృత్ భారత్ పథకంలో భాగంగా రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేయడంతో పాటు ప్రయాణీకులకు వసతులు కల్పించనున్నారు. ఈమేరకు మాస్టర్ ప్లాన్ రూపొందించాలని రైల్వే జనరల్ మేనేజర్లకు కేంద్ర రైల్వేశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. అమృత్ భారత్ పథకంలో దక్షిణ పశ్చిమ రైల్వే డివిజన్‌లో కుప్పం, బంగారుపేట, హోసూరు, మాలూరు, హిందూపురం, ధర్మపురి స్టేషన్లతో పాటు బెంగళూరు నగరంలోని ప్రధాన రైల్వేస్టేషన్లను చేరా్చరు.

## కాటేసిన కర్మాగారం

### ఇద్దరు కార్మికులు మృతి
### కర్మాగారానికి తాళాలు వేసిన స్థానికులు



మృతి చెందిన కార్మికులు

రేణిగుంట, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త:

రేణిగుంట మండలం గాజులమండ్యం పారిశ్రామిక వాడలోని శ్రీ రాధా బయోటెక్ కర్మాగారం ఇద్దరు కార్మికులు మృతి చెందిన సంఘటన గురువారం జరిగింది. స్థానికుల ఆగ్రహించి కర్మాగారానికి తాళాలు వేశారు. పారిశ్రామిక వాడలోని శ్రీ రాధా బయోటెక్ కర్మాగారంలో కర్మాగారం అధికారుల ఆదేశాల మేరకు నరేంద్ర(21), వెంకటేష్(21)లు ట్యాంకును శుభ్రం చేయడానికి ఉపక్రమించారు. అతి విష పూరితమైన కెమికల్స్ ట్యాంకులో ఉండడం వల్ల ఇద్దరు స్పృహ తప్పి అపస్మారక స్థితిలోకి వెళ్లారు. వెంటనే తోటి కార్మికులు వీరిని చికిత్స నిమిత్తం తిరుపతి రుయాకు పంపారు. చికిత్స పొందుతూ ఇద్దరు మృతి చెందారు. వీరి మరణ వార్త తెలియడంతో స్థానికులు ఆగ్రహావేశాలకు గురై కర్మాగారం వద్దకు చేరుకున్నారు. విషయం తెలుసుకున్న ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి అక్కడకు వచ్చారు. ఈ లోపు రూరల్ సీఐ ఆరోహణరావు, ఎస్ఐ ధర్మారెడ్డి సంఘటనా స్థలం చేరుకుని పరిస్థితులను సమీక్షించి ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి సమాచారాన్ని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డికి తెలపడంతో ఇరు కుటుంబాలకు న్యాయం చేయాలని ఆదేశించారు. ఆగ్రహావేశాలకు గురైన స్థానికులు కర్మాగారం మెయిన్‌గేటుకు తాళాలు వేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## సైకిల్ పాలనతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

- ★ జీఓ నెం.1ని ఏ1 తెచ్చి నన్ను ఆపలేరు
- ★ ప్రభుత్వంపై నారా లోకేష్ ఘాటైన వ్యాఖ్యలు
- ★ పాదయాత్రలో ప్రచార వాహనాల సీజ్ పోలీసుల యత్నం
- ★ పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేసిన నారా లోకేష్,అమర్



పలమనేరు, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త:

రాష్ట్రంలో సైకో పాలన పోవాలని, సైకిల్ పాలనతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ప్రజలకు సూచించారు. గురువారం పలమనేరు పట్టణంలో యువగళం పాదయాత్ర ఘన విజయం సాధించింది. కేటిల్ ఫామ్ విడిది కేంద్రం నుండి ఉదయం బయలుదేరిన నారా లోకేష్‌కు వేల సంఖ్యలో ప్రజలు బ్రహ్మరథం పట్టారు. నాగమంగళం వద్ద వేల సంఖ్యలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఆయనకు భారీ గజమాలలతో ఘన స్వాగతం పలికారు. పాదయాత్రలో భాగంగా హాజరైన టిడిపి సీనియర్ నాయకులకు నారా లోకేష్ పాదాభివందనం చేశారు. అధిక సంఖ్యలో ప్రజలు టిడిపి నారా లోకేష్ ఆధ్వర్యంలో టిడిపిలో చేరడం జరిగింది. స్థానిక నాగమంగళం వద్ద ఎంఎస్ఎంఈ యూనియన్ ప్రతినిధులు ఆయనతో మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఎంఎస్ఎం ఈ పరిశ్రమల స్థాపనకు చదరపు మీటరుకు రూ.939కు ఇస్తే ఇప్పుటి వైకాపా ప్రభుత్వం ల్యాండ్ రివైజ్డ్ కాస్ట్ పేరుతో అదనంగా రూ.383 వసూలు చేస్తుందని, సబ్సిడీ రుణాలు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం నారా లోకేష్‌ను కలిసిన న్యాయవాదులు అధికారంలోకి రాగానే ఇళ్ల పట్టాలు ఇస్తామని, స్థానిక ఎమ్మెల్యే వెంకటేగౌడా మోసం చేశారని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. అధికారంలోకి రాగానే న్యాయవాదులకు ఇళ్లపట్టాలు అందించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం పట్టు పరిశ్రమ కేంద్రం వద్దకు చేరుకున్న ఆయనతో పట్టు రైతులు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పట్టురైతులకు ఇచ్చిన ప్రోత్సాహకాలన్నీ వైకాపా ప్రభుత్వం నిలిపివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక అంబేద్కర్ సర్కిల్ వద్దకు చేరుకున్న ఆయన ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రభుత్వానికి యువగళం పాదయాత్ర అంటే ఎందుకంత భయమని, ఏ1 జిఒ నెం.1 తీసుకువచ్చి నన్ను ఆపలేరని పేర్కొన్నారు. టిడిపికి పెరుగుతున్న ఆదరణను చూసి ముఖ్యమంత్రికి చెమటలు పడుతుందని పరోక్షంగా పలు చర్యలకు ప్రభుత్వం ప్రయత్నిస్తుందని పేర్కొన్నారు. ఎన్నికల ముందు 25 ఎంపి సీట్లు ఇస్తే కేంద్రం మెడలు వంచి ప్రత్యేక హోదా తీసుకువస్తానని ముఖ్యమంత్రి అధికారం వచ్చిన తరువాత ఆ మాట మరచి పోయారని తెలిపారు. పలమనేరు ఎమ్మెల్యేకు పలమనేరు నియోజకవర్గంలో ఏ పని జరగాలన్నా 10శాతం కప్పం కట్టాలని నారా లోకేష్ విమర్శించారు. పలమనేరు ఎమ్మెల్యే బెంగళూరులో ఉంటు పలమనేరు అభివృద్ధికి గాలికి వదిలేశారని, సమస్యలను ప్రశ్నిస్తే కేసులు పెట్టడం వేధించడం జరుగుతుందన్నారు. బైరెడ్డిపల్లె రౌడీలను మాపై పంపినంత మాత్రం మీరు చేసేది ఏమిలేదని విమర్శించారు. జిల్లాలో పెద్దిరెడ్డి బినామీ పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడా అని అన్నారు. టిడిపిలో 80రోడ్డు ప్రారంభిస్తే ఎమ్మెల్యే ఆపేశారని, కైగల్ రిజర్వాయర్‌ను పూర్తి చేసేందుకు 16కోట్లు కేటాయించారు. ఆ పనులనూ నిలిపేశారని, గ్రనైట్ మైన్‌ను కూడా ఎమ్మెల్యే దోచేసి సుమారు 12 కోట్లు విలువగల మైన్‌ను మింగేశారని విమర్శించారు. పలమనేరు టిడిపి తరపున ఎమ్మెల్యేగా మాజీ మంత్రి అమరనాథరెడ్డి పోటీ చేస్తారని ప్రకటించారు. కాగా యువగళం పాదయాత్రలో ప్రచార వాహనాల పోలీసులు సీజ్‌కు యత్నించారు. దీంతో పాదయాత్రలో ఉద్రిక్త వాతవరణం చేటుచేసుకుంది.

## టిక్కెట్ ఖరారైనట్లే!

### ప్రజల అభిప్రాయాలకనుగుణంగా పనితీరు మార్చుకోండి
### -పార్టీశ్రేణులతో మమేకమై నడిస్తేనే గెలుపుసాధ్యం
### -తిరుపతి ఇన్‌ఛార్జి సుగుణమ్మకు అధినేత దిశానిర్ధేశం



తిరుపతి, ఫిబ్రవరి2ప్రభాతవార్త:

తెలుగుదేశంపార్టీకి తొలినుంచి పట్టుఉన్న, ఓటు బ్యాంకు కలిగిన తిరుపతి నియోజకవర్గంలో ప్రజల అభిప్రాయాలకనుగుణంగా నాయకులు, పార్టీ శ్రేణులు పనిచేయాలని, ఆ దిశగా పోరాటాలు చేసి ప్రజలకు అండగా నిలబడితేనే పార్టీకి మరింత గుర్తింపు ఉంటుందని టిడిపి అధినేత, మాజీ సిఎం చంద్రబాబునాయుడు సూచించారు. కార్యకర్తల నుంచి అభిమానులు, ద్వితీయశ్రేణి నాయకులున్న పార్టీశ్రేణులతో మమేకమై నడిస్తేనే రానున్న ఎన్నికల్లో గెలుపుసాధ్యమని ఇన్‌ఛార్జి ఎం.సుగుణమ్మకు చంద్రబాబు దిశానిర్ధేశం చేశారు. పార్టీలో కుటుంబసభ్యుల జోక్యాన్ని పక్కన పెట్టాలని, పార్టీకి చెడ్డపేరు తీసుకువచ్చేలా నడిస్తే సహించబోమని, అది మంచిదికాదని సుతిమెత్తగా బాబు సూచించారు. తిరుపతి నియోజకవర్గంలో పార్టీ బాధ్యతలు అప్పగించానని, ఇప్పటి వరకు పనితీరు ఆశాజనకంగానే ఉన్నా మరింత గట్టిగా, కష్టపడి ప్రజల కోసం పనిచేయాలని నిర్ధేశం చేశారు. పార్టీని కాపాడుకునే దిశగా అందరూ ఏకతాటిపై పనిచేయాలని, గత నాలుగేళ్ళుగా పార్టీని నడిపిస్తూ ,ఇప్పటి వరకు పార్టీ ఆదేశించిన బాదుడేబాదుడు, ఇదేంఖర్మ మనరాష్ట్రానికి కార్యక్రమాలు నిర్వహిస్తున్నా ప్రజల్లోకి చొచ్చుకుపోవాలని ,అధికార వైసిపి నేతలకు ధీటుగా పనిచేయాలని సూచించారు. పార్టీలో నాయకులు చాలామంది ఉన్నారని , పదవులు ఇచ్చామని వారు కలసి నడిచేలా చూడాలన్నారు. తిరుపతిలో పార్టీని బలోపేతం చేసుకోవడంలో పార్టీ కోసం కలసి వచ్చే నాయకులు ఎవరైనా పిలిచి ఆహ్వానించాలని, అందరినీ సమానంగా చూస్తూ కార్యక్రమాలు చేయాలన్నారు. దీనివల్ల ఐక్యత ఉంటుందని. చిన్నచిన్న వ్యతిరేకత ఉన్నా తొలగించుకునే దిశగా ప్రయత్నాలు సాగించి, ఎన్నికల్లో గెలుపు లక్ష్యంగా వ్యూహాత్మకంగా అడుగువేయాలని బాబు హితవు చేశారు. రానున్న ఎన్నికలకు పార్టీ కేడర్‌ను బలోపేతం చేస్తూ, టిక్కెట్ ఎందుకు ఇవ్వాలో, ఎందుకు ఇవ్వకూడదనే కోణంలో చంద్రబాబు నియోజకవర్గ ఇన్‌ఛార్జిలతో స్వయంగా పార్టీ కార్యాలయంలో సమీక్షిస్తుండటం జరుగుతుంది. ఈ నేపథ్యంలో గురువారం సాయంత్రం విజయవాడలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో తిరుపతి ఇన్‌ఛార్జి ఎం.సుగుణమ్మ చంద్రబాబును కలిశారు. తిరుపతిలో పార్టీ పరిస్థితిని బాబు అడిగి తెలుసుకుంటూ తన వద్ద జాతకాలను ,నివేదికలను పరిశీలిస్తూ సుగుణమ్మ పనితీరుపై కొంత సదభిప్రాయం వ్యక్తం చేశారు. ఎన్నికలకు ఇప్పటి నుంచే సిద్దం కావాలని, నిత్యం ప్రజల మధ్య ఉండాలని బాబు సూచించారు. అనంతరం సుగుణమ్మ తన వారసురాలు (మనవరాలు)బివి కీర్తిని చంద్రబాబుకు పరిచయం చేశారు. అల్లుడు సంజయ్‌తో కలసి చంద్రబాబును దుశ్శాలువతో సన్మానించి, ఇష్టదైవమ్ వెంకన్న ప్రసాదాలను అందజేశారు.

## టెన్త్ విద్యార్ధులపై ప్రత్యేక దృష్టి

### సమ్మేటివ్ ఫలితాలపై విశ్లేషణ - కలెక్టర్



చిత్తూరు, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త:

జిల్లా టెన్త్ పరీక్షల్లో అగ్రస్థానం సాధించేలా ఈ ఏడాది టెన్త్ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని కలెక్టర్ హరినారాయణన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం కలెక్టర్ హరినారాయణన్ డిఇఓ విజయేంద్రరావు, ఎస్ఎస్ఎ పిఓ వెంకటరమణారెడ్డిలతో కలిసి మండల విద్యాశాఖ అధికారులు, ఎపిఎంలతో సమ్మేటివ్, అస్సెస్మెంట్ ఫలితాలు, బడి బయటి పిల్లలు పాఠశాలల్లో చేర్పించే అంశం, జగనన్న గోరుముద్ద, నాడు-నేడు, బయోమెట్రిక్ తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల్లో విద్యా సామర్థ్యం కోసం నిర్వహిస్తున్న సమ్మేటివ్, అస్సెస్మెంట్ ఫలితాలపై ఎంఇఓలు విశ్లేషణ చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని, ఇంతటి ప్రాధాన్యత వున్న విద్యపై ఎంఇఓలు, ఎపిఎంలు దృష్టి కేంద్రీకరించాలన్నారు. సమ్మేటివ్, అస్సెస్మెంట్ పరీక్షల్లో 6 నుండి 9వ తరగతి వరకు మార్కుల్లో వెనుకబడ్డ విద్యార్థులపై ప్రస్తుతం ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి వారిని మెరుపుల్లో తయారు చేయాలన్నారు. అలాగే టెన్త్ పరీక్షలు సమీపిస్తుండటంతో టెన్త్ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, టెన్త్ విద్యార్థులకు పాఠశాలల్లో ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. ఎంఇఓలు పాఠశాలల తనిఖీ సమయంలో జగనన్న గోరుముద్ద నాణ్యత, ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు, 8వ తరగతి విద్యార్థుల ట్యాబుల వినియోగం తదితరాలను కచ్చితంగా పరిశీలించాలన్నారు. అలాగే ఎపిఎంలు సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనపై పూర్తి అవగాహన పెంచుకోవాలన్నారు. జగనన్న గోరుముద్ద పథకంలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ప్రతినెలా 5వ తేదీ ఎపిఎంలు ఎంఇఓలు టూర్ డైరీలను జిల్లా విద్యాశాఖ అధికారికి అందించాలన్నారు. బడి బయట పిల్లలను గుర్తించి వారిని పాఠశాలకు రప్పించడానికి సమన్వయంతో విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో మండల విద్యాశాఖ అధికారులు, ఎపిఎంలు పాల్గొన్నారు.

## అందరి సూచనల మేరకే నిర్ణయం

### - ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి



వెంకటగిరి, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త:

అందరి సూచన మేరకే ఒక నిర్ణయం తీసుకుంటానని మాజీ మంత్రి, ఎమ్మెల్యే ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. నియోజకవర్గంలోని వైసీపీ పార్టీ కార్యకర్తలు, నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. మన ప్రాంత అభివృద్ధికి, అందరి మంచి కోసం ఉపయోగపడే విధంగా నిర్ణయం ఉంటుందన్నారు. తాను రైతుల కోసం తెలుగుగంగ నీటిని ఇప్పించేందుకు ప్రాణత్యాగానికి కూడా సిద్ధపడ్డానని, అప్పటి పోరాట ఫలితమే నేడు లక్షల మంది రైతులు సంతోషంగా ఉన్నట్లు తెలిపారు. రాపూరు నియోజకవర్గం ఎంతగానో అభివృద్ధి చెందిందన్నారు. 40 సంవత్సరాల రాజకీయ చరిత్ర నాకు ఉందన్నారు. నాకు బంగ్లాలు లేవని, చిన్నపాటి ఇల్లు మాత్రమే ఉందన్నారు. నేదురుమల్లి రామ్ కుమార్‌రెడ్డిపై ఆయన పరోక్షంగా విమర్శించారు. 2014 రామ్‌కుమార్‌రెడ్డి పోటీ చేసి పరారై వెళ్లాడని పరోక్షంగా విమర్శించారు. ఎన్నికల్లో పరారైన వ్యక్తికి నియోజకవర్గ బాధ్యతలు ఇవ్వడం విచిత్రంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. సర్పంచులకు కేంద్రం ఇచ్చిన నిధులు కూడా ఖాతాల్లో లేకుండా చేశారని విమర్శించారు. సమావేశంలో ఎంపీపీలు బాలకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### వేడుకగా ప్రారంభమైన టిటిడి ఉద్యోగుల క్రీడలు



4లో

## డిఆర్‌డిఓకు జిడినెల్లూరుకు సమీపంలో 9 ఎకరాల స్థలం

### - సిసిఎల్ఏ కార్యదర్శి సాయిప్రసాద్ వీడియో కాన్ఫరెన్స్

*చిత్తూరు, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త: భారత రక్షణ రంగ సంస్థ(డిఆర్‌డిఓ)కు జిడినెల్లూరుకు సమీపంలో 9 ఎకరాల స్థలం కేటాయించాలని సిసిఎల్ఏ కార్యదర్శి సాయిప్రసాద్ అన్నారు. గురువారం సిసిఎల్ఏ కమీషనర్ సాయిప్రసాద్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో సమీక్షించారు. చిత్తూరు కలెక్టరేట్ నుండి ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టర్ హరినారాయణన్, జెసి వెంకటేశ్వర్‌లు హాజరయ్యారు. ఈ కాన్ఫరెన్స్‌లో సిసిఎల్ఏ కార్యదర్శి మాట్లాడుతూ భారత రక్షణ రంగ సంస్థకు సంబంధించిన కార్యాలయాలను గంగాధరనెల్లూరుకు సమీపంలో ఏర్పాటు చేయాలని భావించడం జరిగిందన్నారు. ఈ కార్యాలయాల నిర్మాణం కోసం 9 ఎకరాల భూమి అలిగేషన్ కార్యక్రమంను సత్వరం పూర్తి చేయాలన్నారు. ఇప్పటికే స్థలంను పరిశీలించడం జరిగిందని, ప్రభుత్వ ఆదేశాల మేరకు కేటాయించడం జరుగుతుందని, ఎస్ఆర్‌పురంలో ఇప్పటికీ పలు నిర్మాణాలు జరుగుతున్నాయని జాయింట్ కలెక్టర్ సిసిఎల్ఏ కార్యదర్శి సాయిప్రసాద్‌కు వివరించారు.*

### ఉష్ణోగ్రతలు
2/2/2023



- తిరుపతి 29 డిగ్రీలు
- చిత్తూరు 30 డిగ్రీలు
- మదనపల్లి 24 డిగ్రీలు
- శ్రీకాళహస్తి 29 డిగ్రీలు
- వెంకటగిరి 30 డిగ్రీలు
- గూడూరు 30 డిగ్రీలు

### బంగారం ధరలు
2/2/2023



22 క్యారెట్స్ 1గ్రాము రూ. 5, 505

24క్యారెట్స్ 1గ్రాము రూ.5,867

### కోడిగ్రుడ్ల ధరలు
2/2/2023



కోడిగ్రుడ్డు :రూ.6.00

1 డజను: రూ.72.00

## సత్రవాడ చుట్టూ శ్రీకాళహస్తి రాజకీయం

### చంద్రబాబుతో భేటికి సానుకూలం
### యువగళం పాదయాత్రలో పాల్గొనటానికి సుముఖత



సత్రవాడ మునిరామయ్యతో భేటి అయిన సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి రాజకీయ చిత్రం రోజు రోజుకు మారుతుంది. సాధారణ ఎన్నికలు ఎప్పుడు వస్తాయో ఏమో తెలియదు కానీ 2019లో ఘోర పరాజయం పొందిన తెలుగుదేశం రాబోవు ఎన్నికల్లో తమ సత్తా చాటుకోవటానికి పావులు కదుపుతున్నారు. ఈ నేపథ్యంలో నియోజకవర్గ ఇన్‌చార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి మాజీ శాసనసభ్యుడు సత్రవాడ మునిరామయ్యను కలసి పార్టీలోకి రావాలని ఆహ్వానించారు. రాజకీయాల పట్ల అవగాహన కలిగిన మాజీ ఎంఎల్ఏ సత్రవాడ మునిరామయ్య అన్ని కోణాల నుంచి సమీక్షించుకున్న ఆయన గురువారం తమ కమ్యూనిటీ ప్రముఖులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి వివిధ అంశాలను చర్చించుకున్నారు. అందరి అభిప్రాయాలతో చంద్రబాబునాయుడును కలవడానికి నిర్ధారించుకున్నట్లు పార్టీ వర్గాలు చర్చించుకుంటున్నాయి. మునిరామయ్య సానుకూలంగా స్పందిస్తూ తాను పార్టీ జాతీయ అధ్యక్షుడు నాచాచంద్రబాబునాయుడుతో భేటి కావటానికి అంగీకరించినట్లు తెలుగుదేశం పార్టీ జారి చేసిన ప్రకటనలో తెలిపారు. అలాగే యువగళం పాదయాత్రలో నారాలోకేష్‌తో కలసి నడవటానికి కూడా సుముఖత వ్యక్తం చేసినట్లు ప్రకటించారు. గత కొంత కాలంగా బొజ్జల సతీమణి బొజ్జల బృందమ్మ, సత్రవాడతో చర్చిస్తున్నారు. అలాగే మాజీ ఎంఎల్ఏ సత్రవాడ కుమారుడు సత్రవాడ ప్రవీణ్ వైసిపి రాష్ట్ర యువత ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. ఆయనను కూడా పార్టీలోకి ఆహ్వానించారు. ఆయన కూడా సుముఖంగానే ఉన్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గం శాసనసభ్యుడుగా, తుడా చైర్మెన్‌గా, కౌన్సిలర్‌గా మునిరామయ్య ముక్కుసూటిగా వ్యవహరించే నాయకుడుగా పేరు సంపాదించారు. నియోజకవర్గ ఇన్‌చార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి దౌత్యం ఫలించిందని చెప్ప వచ్చు. చంద్రబాబుతో చర్చించిన మీదట శ్రీకాళహస్తిలోని ఎన్‌టిఆర్ భవన్‌లో సమావేశం ఏర్పాటు చేసి ప్రకటించుటకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ భేటిలో సీనియర్ తెలుగుదేశం నాయకులు యువత పాల్గొన్నారు.

## మాస్టర్‌ప్లాన్ అమలుపై ద్రోణా కన్సల్టెన్సీ రివ్యూ

కాణిపాకం, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త:



మాస్టర్ ప్లాన్ రివ్యూ నిర్వహిస్తున్న ద్రోణా కన్సల్టెన్సీ ప్రతినిదులు, ఆలయ అధికారులు.

కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంలో మాస్టర్ ప్లాన్ అమలులో భాగంగా న్యూడిల్లీకి చెందిన ద్రోణా కన్సల్టెన్సీ ప్రతినిధులు గురువారం రివ్యూ నిర్వహించారు. కాణిపాకం ఆలయ దర్శనార్థం వచ్చే భక్తుల సౌకర్యార్థం దేవస్థానం 2012 నుండి మాస్టర్‌ప్లాన్‌ను అమలు చేస్తోంది. ఇందులో భాగంగా కోట్లాది రూపాయల వ్యయంతో పలు అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నారు. అలాగే పలు అభివృద్ధి పనులకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈనేపథ్యంలో మాస్టర్‌ప్లాన్ అమలు కోసం దేవస్థానం కాంట్రాక్ట్ కుదుర్చుకున్న న్యూడిల్లీకి చెందిన గ్రోణా కన్సల్టెన్సీ శ్రీకార్ ఆధ్వర్యంలో సంస్థ ప్రతినిదులు మాస్టర్ ప్లాన్ అమలులో మార్పులు చేర్పుల కోసం గురువారం కాణిపాకం చేరుకుని ఆలయ అధికారులతో రివ్యూ నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ చైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, ఈఓ ఎ.వెంకటేశు, ఈఈ వెంకట నారాయణ, ఇంజీరింగ్ సిబ్బందితో కలసి అభివృద్ధి పనుల ప్రతిపాదిత స్థలాలను పరిశీలించారు. ఈమేరకు అభివృద్ధి పనుల స్థలాల మార్పులు, చేర్పులపై కన్సల్టెన్సీ వారు ఆలయ అధికారులతో చర్చించారు. ఈమేరకు వారు తుది రూపు ఇవ్వనున్నారు. ఈకార్యక్రమంలో దేవస్థానం ఏఈలు అరవింద్, శివాంజనేయులు, కాంట్రాక్టర్ శ్రీదర్‌రెడ్డిలతో పాటు ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

# 'చుడా'చే కాణిపాకంలో సుందరీకరణ పనులు



కాణిపాకం, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామి వారి దేవస్థానం అభివృద్దిలో భాగంగా చిత్తూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(చుడా) వారిచే సుందరీకరణ పనుల నిర్వహణకు గురువారం చుడా అధికారులు దేవస్థానం అధికారులతో కలసి పరిశీలించారు. కాణిపాకం ఆలయ దర్శనార్థం వచ్చే భక్తుల సౌకర్యార్థం దేవస్థాం ఆధ్వర్యంలో కోట్లాది రూపాయల వ్యయంతో పలు అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా దేవస్థానం సందర్శనార్థం వచ్చే భక్తులకు ఆహ్లాదాన్ని అందించేందుకు సుందరీకణ పనులు చేపట్టాలని దేవస్థానం నిర్ణయించింది. ఈమేరకు చుడా ఆధ్వర్యంలో దేవస్థానం పరిసరాలు, వంద అడుగుల రోడ్డు డివైడర్ల వద్ద పార్కుల ఏర్పాటు, మొక్కలు పెంచడం వంటి వాటిని చేపట్టనున్నారు. ఇందుకోసం చుడా ఛైర్మన్ పురుషోత్తం రెడ్డి ఆదేశాల మేరకు చుడా వైస్ ఛైర్మన్ విశ్వనాధ్, ప్లానింగ్ అధికారి మదు తదితరులు ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, ఈఓ ఎ.వెంకటేశులతో కలసి ఆలయ పరిసరాలను, వంద అడుగుల రోడ్డు పక్కనున్న వామన పార్కింగ్ స్థలం తదితర ప్రాంతాలను పరిశీలించారు. ఈకార్యమ్రంలో దేవస్థానం ఈఈ వెంకట నారాయణ, ఏఈలో అరవింద్, శివాంజనేయులు, చుడా సిబ్బంది, ఆలయ ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## యువగళం పాదయాత్రో వెదురుకుప్పం నేత అడుగులు



వెదురుకుప్పం, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త : తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్ కుప్పంలో ప్రారంభించిన యువగళం పాదయాత్ర తొలి రోజు నుంచి వెదురుకుప్పంకు చెందిన క్లస్టర్ ఇన్‌చార్జ్,మాజీ టీడీపీ జిల్లా కార్యదర్శి మోహన్ మురళి అడుగులు వేస్తున్నారు. ఏడవ రోజు గురువారం సాగుతున్న పాదయాత్రలో లోకేష్ వెంట సాగుతున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువగళం పాదయాత్రకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందన్నారు. అడుగడుగున ప్రజల ఆదరణ అభిమానంతో సాగుతుందన్నారు. యువనేత ప్రజా సమస్యల పై ప్రత్యేక దృష్టి కేటాయించిసమస్యలుతెలుసుకుంటున్నారనిచెప్పారు.ఆయనతోపాటు మాజీ మంత్రి అమర్నాధ రెడ్డి ఉన్నారు.

## ఐఆర్ఎం కాలేజీను సందర్శించిన ఫ్రాన్స్ దేశస్తులు



కుప్పం, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త కుప్పం పట్టణంలోని ఐఆర్ఎం డిగ్రీ కాలేజీను ఫ్రాన్స్ దేశానికి చెందిన ఫ్రాంక్‌లిరోయ్ సందర్శించినట్లు కళాశాల ఛైర్మన్ బిఎం దయానిధి తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థులు ఆయనకు పుష్ప గుచ్ఛం అందించి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఫ్రాంక్ లిరోయ్ ఫ్రాన్స్ దేశంలోని విద్యావిధానం, ఉద్యోగావకాశాల గురించి విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. ఛైర్మన్ బిఎం దయానిధి మాట్లాడుతూ విదేశాల్లో తమ విద్యార్థులకు ఉద్యోగావకాశాలు కల్పించడమే తమ ధ్యేయమ న్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అన్ని వర్గాల సంక్షేమం కోసం పథకాలు - ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు



గుడిపాల, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త: అన్ని వర్గాల సంక్షేమం కోసం సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివా సులు పేర్కొన్నారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మండలంలోని బొమ్మసముద్రం గ్రామ సచివాలయం పరిధిలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఇంటింటికి వెళ్ళి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయో! లేదో! అని అడిగి తెలుసుకొన్నారు. అలాగే పథకాలకు అర్హులై వుండి ఎవరికైనా మంజూరు కాకుంటే ప్రస్తుతం దరఖాస్తు చేసుకొంటే అధికారులు పరిశీలించి మంజూరు చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ప్రసాద్‌రెడ్డి, జడ్పీ వైస్ ఛైర్మన్ రమ్య, మండల వైకాపా కన్వీనర్ జనార్థన్, చుడా ఛైర్మన్ పురుషోత్తంరెడ్డి, మార్కెట్ కమిటీ ఛైర్మన్ రాహుల్‌రెడ్డి, సర్పంచ్ ఏంజిలీనా, ఎంపిటిసి జెనిఫా, ఎంపిడిఓ ఉపేంద్ర, తహసిల్దారు బాబు రాజేంద్రప్రసాద్, మండల అధికారులు, వైకాపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గోసంరక్షణ ట్రస్ట్‌కు రూ.లక్ష విరాళం



కాణిపాకం, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంలో అమలవుతున్న శ్రీసిద్ది వినాయక గోసంరక్షణ ట్రస్ట్‌కు ఓ భక్తురాలు గురువారం లక్ష రూపాయలను విరాళంగా అందించారు. ఈ మేరకు హైదరాబాద్, జూబ్లీహిల్స్‌కు చెందిన నీలిమా మోహన్ అనే భక్తురాలు 1,00,116 రూపాయలను విరాళంగా అందజేశారు. ఈమొత్తాన్ని దాత కుటుంబసభ్యులతో కలసి సూపరెండెంట్ కోదండపాణి, టెంపుల్ ఇన్ స్పెక్టర్ బాబులకు అందజేశారు. దాతలకు ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి దర్శనం కల్పించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో దాత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

## సొంతింటి కల నెరవేర్చుకోవాలి : దామోదర్‌రాజు



చౌడేపల్లి, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త ప్రభుత్వం మంజూరు చేసిన గృహాలను నిర్మించుకొని సొంతింటి కలను నెరవేర్చుకోవాలని జడ్పీటీసీ నడింపల్లి దామోదర్‌రాజు లబ్దిదారులకుతెలిపారు.వైఎస్సార్‌కాలనీలోపక్కాగృహాలుమంజూరై నిర్మాణాలు త్వరితగతిన చేపట్టని లబ్దిదారులతో ఆయన ఇంటింటికీ వెళ్ళి మాట్లాడారు. పట్టణంలో బాడుగ ఇళ్ళల్లో వున్న వారందరూ పక్కా గృహం కోసం ధరఖాస్తు చేసుకొన్నారనీ, అయితే నిర్మాణంలో ఆలస్యం చేయడం తగదన్నారు.అందరూనిర్మాణాలుచేపట్టాలనిఆయన కోరారు. ఎంపిడిఓ సుధాకర్, సచివాలయపాల్గొన్నారు.

## చెరకుతోట దగ్ధం: రూ.1.20లక్షలు నష్టం

రొంపిచెర్ల, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త మండల పరిధిలోని పెద్దగొట్టిగల్లు గ్రామ పంచాయతీ మేకలవారిపల్లెకు చెందిన ప్రభాకరరెడ్డి గ్రామానికి సమీపంలో రెడ్డిచెరువు కింద ఎకరా పొలంలో చెరకుతోట పంట సాగుచేశారు.గురువారం మధ్యాహ్నం 2 గంటలకు గుర్తు తెలియని వ్యక్తులు చెరకుతోటకు నిప్పు పెట్టారని రైతు తెలిపాడు. చుట్టుపక్కల ఉన్న రైతులు వచ్చి మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు.అప్పటికే పంట కాలిపోయింది. ఈ ఘటనలో రూ.1.20లక్షల విలువైన పంట నష్టం జరిగిందని బాధిత రైతు వాపోయాడు.

## బూడిద తెగుళ్ల నివారణకు చర్యలు చేపట్టాలి

కుప్పం, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త పంటలను ఆశించే బూడిద తెగుళ్ల నివారణకు రైతులు తగు చర్యలు చేపట్టాలని ఉద్యానవన అధికారి డింపు ప్రియ పేర్కొన్నారు. లీటరు నీటిలో కరిగే సల్ఫర్ మూడు గ్రాములు కలిపి పిచికారీ చేయాలన్నారు. అలాగే పూతకాడ ఏర్పడే సమయంలో హెక్సా కానజోల్ 5ఎస్‌సి లీటరునీటికి రెండు మిల్లీల వంతున కలిపి పిచికారీ చేయాలన్నారు. ఏమందును పిచికారీ చేసిన బంకమందును కలిపి పిచికారీ చేస్తే ఫలితాలు బాగుంటాయన్నారు.

## నేడు రామకుప్పం ఎంపిపి..వైస్‌ఎంపిపి ఎన్నికలు

రామకుప్పం, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త రామకుప్పం ఎంపిపి, వైస్ ఎంపిపి ఎన్నికలను శుక్రవారం మండల కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఓ రాధాకృష్ణ తెలిపారు. గత రెండు పర్యాయాలు ఈ ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ జారీ చేసినా ఎంపిటిసి సభ్యులు హాజరు కాకపోవడంతో ఎన్నికలు వాయిదా పడ్డాయి. ప్రస్తుతం అధికారులు మరోమారు నోటిఫికేషన్ ప్రకటించడంతో ఈసారైనా ఎన్నికలు జరుగుతాయా లేదా అనేది వేచి చూడాలి.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## రైతు భరోసా కేంద్రం తనిఖీ చేసిన ట్రైనీ కలెక్టర్

గుడిపాల, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త: పానాటూరు రైతు భరోసా కేంద్రను గురువారం ట్రైనీ కలెక్టర్ మేఘస్వరూప్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ట్రైనీ కలెక్టర్ రైతు భరోసా కేంద్రంలో రైతులతో మాట్లాడుతూ రైతుల కోసం ప్రభుత్వం అందిస్తున్న సేవలను వివరించి వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి హబీబ్‌బాషా, డివిజన్ ఎడిఎ మధుసూధన్, మండల ఎఓ మాధవి, సర్పంచ్ మధుసూధన్‌రెడ్డి, సిహెచ్‌సి గ్రూప్ లీడర్లు సిఆర్ శ్రీహరి, ప్రవీణ్‌రెడ్డి, సభ్యులు తులసీరామ్‌రెడ్డి, మనుమన్‌నాయక్, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

## లేఅవుట్లలో ఇళ్ళ నిర్మాణాలు వేగవంతం- కమిషనర్ డాక్టర్ జె.అరుణ



చిత్తూరు, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త: చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని జగనన్న హౌసింగ్ లేఅవుట్లలో ఇళ్ళ నిర్మాణాలను మరింత వేగవంతం చేయాలని కమిషనర్ డాక్టర్ జె.అరుణ అధికారులను ఆదేశించారు. కమిషనర్ డాక్టర్ జె.అరుణ గురువారం బండపల్లి-1, 2 లేఅవుట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మార్చి 15వ తేదీ నాటికి ఇళ్ళ నిర్మాణాలు పూర్తి అయ్యేలా ప్రణాళికలు రచించి అమలు చేయాలని వార్డు కార్యదర్శులను ఆదేశించారు. ఇళ్ళ నిర్మాణాలు చేసుకొంటున్న లబ్దిదారులకు పూర్తి సహాయ సహకారాలు అందించాలన్నారు.సిఎంపిగోపి,హౌసింగ్ఎఇశ్రీధర్,టిపిఓమురళీకృష్ణ, వార్డు అనిమిటీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## అభివృద్ధి..సంక్షేమం సిఎం జగనన్నతోనే సాధ్యం - ఎమ్మెల్సీ భరత్



కుప్పంరూరల్, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం సిఎం జగనన్నతోనే సాధ్యమని చిత్తూరు ఎమ్మెల్సీ, జిల్లా వైకాపా అధ్యక్షుడు కెఆర్‌జె భరత్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని కొత్తపల్లి పంచాయతీ సజ్జలపల్లిలో గడపగడపకు మీ ప్రభుత్వం కార్య క్రమాన్ని ఆయన చేపట్టారు. ఈసందర్భంగా సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వివరించి ప్రజలకు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన హామీలు అమలు చేసిన ఘనత సిఎం జగనన్నకే దక్కుతుందన్నారు. పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అర్హులకు అందిస్తామన్నారు. వచ్చే ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే కుప్పాన్ని మరింత అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వన్నియకులక్షత్రియ కార్పోరేషన్ ఛైర్మన్ వనిత శ్రీను, స్థానిక నేతలు పాల్గొన్నారు.

## 20లక్షలతో స్మశాన వాటికకు సిసి రోడ్డు నిర్మాణం



కుప్పంరూరల్, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త కుప్పం మున్సిపల్ పరిధి 25వ వార్డు లక్ష్మీపురంలోని స్మశాన వాటికకు దశాబ్దాల కాలంగా రోడ్డు సౌకర్యం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యేవారు. ఈ నేపథ్యంలో స్థానిక కౌన్సిలర్ మణి సమస్య పరిష్కారంకు చర్యలు చేపట్టారు. సుమారు ఇరవై లక్షల రూపాయలతో స్మశాన వాటికకు సిమెంట్ రోడ్డు నిర్మాణం పనులు చేపడుతున్నారు. దీంతో స్థానికులు కౌన్సిలర్ మణికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నవీన్, కోదండ, లక్ష్మణ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## తెలుగుదేశం కార్యకర్త మృతి.. ఆర్థికసాయం



శాంతిపురం, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త మండలంలోని కడపల్లికి చెందిన తెలుగుదేశం పార్టీ వీరాభిమాని కుమార్ మృతి చెందాడు. దీంతో అతని అంత్యక్రియలకు గాను మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నంలు పదివేల రూపాయల ఆర్థికసాయాన్ని అందించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతివ్యక్తంచేశారు.కార్యక్రమంలో నేతలు విశ్వనాథనాయుడు, సత్యేంద్ర శేఖర్, డా॥వెంకటేష్,మణి,రమేష్,మణితదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి జాబ్ కార్డులకు ఆధార్ అనుసంధానం - డ్వామా పిడి గంగా భవానీ



చిత్తూరు, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త: ఉపాధి కూలీల జాబ్ కార్డులను ఫిబ్రవరి 10వ తేదీలోపు ఆధార్‌కు అనుసంధానం చేయాలని డ్వామా పిడి గంగాభవానీ పేర్కొన్నారు. డిఆర్‌డిఎ సమావేశహాలులో గురువారం డ్వామా పిడి గంగాభవానీ ఎపిడి సుబ్రమణ్యంతో కలిసి చిత్తూరు క్లస్టర్ పరిధిలోని ఫీల్డ్, టెక్నికల్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, జూనియర్ ఇంజనీర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పిడి గంగా భవానీ మాట్లాడుతూ ఫిబ్రవరి 10వ తేదీలోపు ప్రతి జాబ్ కార్డుకు ఆధార్‌ను అనుసంధానం చేయాలని స్పష్టం చేశారు. అలాగే ప్రతి మండలంలో నిర్ధేశించిన లేబర్ బడ్జెట్ ప్రకారం డిమాండ్ కాప్చర్ చేసి మస్టర్, ఎన్ఎంఎంఎస్ యాప్‌లో అప్‌లోడ్ చేయాల న్నారు. ఉపాధి పనులకు వచ్చిన వారికి ప్రతి రోజు కనీసం 257 ఊపాయలు దినసరి కూలీ వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. డిమాండ్‌కు తగిన సెల్ఫ్‌ఆఫ్ వర్క్స్ వుండేలా ఎపిఓలు చూసుకోవా లన్నారు. విధుల నిర్వహణలో ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే వారిపై క్రమశిక్షణ చర్యలు తప్పవన్నారు. అలాగే హార్టికల్చర్, ఫ్లోరికల్చర్, అవెన్యూ ప్లాంటేషన్లకు సంబంధించి ప్రతినెలా 5వ తేదీలోపు చెల్లింపులు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో పెనుమూరు, పాలసముద్రం, జిడి నెల్లూరు, తవణంపల్లి, చిత్తూరు, గుడిపాల, యాదమరి మండలాల ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## కష్టపడితే భవిష్యత్ మీదే - ఆర్డీఓ కిరణ్‌కుమార్



కోట, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త విద్యార్థినులు కష్టపడి చదివితే భవిష్యత్ బంగారుమయం అవు తుందని గూడూరు ఆర్డీఓ కిరణ్‌కుమార్ చెప్పారు. గురువారం కోటలోని సాంఘిక సంక్షేమ బాలికల వసతిగృహంలో వందమంది విద్యార్థినులకు దుప్పట్లు, విద్యాసామగ్రి పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థుల కోసం ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తుందని చెప్పారు. విద్యార్థులు క్రమశిక్షణ, అంకితభావంతో, పట్టుదలతో ఒక ప్రణాళిక ప్రకారం చదువుకుంటే మంచి ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ పద్మావతి, ఎఎస్‌డబ్ల్యు సైదారెడ్డి, వార్డెన్ ఉషా తదితరులు పాల్గొన్నారు.

## రికవరీలపై దృష్టి సారించాలి

కోట, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త కోట, వాకాడు, చిట్టమూరు మండలాల్లోని పొదుపులక్ష్మి గ్రూపులు తీసుకున్న రుణాలను రికవరీ చేయడంలో విఓఎలు దృష్టి సారించాలని ప్రాంతీయ సమన్వయకర్త వెంకటరావు కోరారు. గురువారం స్థానిక ఐకెపి కార్యాలయంలో రుణాలు రికవరీపై సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పొదుపు సభ్యులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించకపోతే వడ్డీలు పెరిగిపోతాయని చెప్పారు. తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించాలని కోరారు. ఆయన వెంట స్త్రీనిధి మేనేజర్ జయకుమార్ తదితరులు ఉన్నారు.

## బస్సుషెల్టర్లకు భూమిపూజ

కోట, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త కోట మండలంలోని చిట్టేడు, చంద్రశేఖరపురం, మైక్రోటవర్ కాలనీ గ్రామాల్లో గురువారం బస్సు షెల్టర్ల నిర్మాణాల కోసం ఎంపిపి దాసరి అంజమ్మ, జడ్పిటిసి సభ్యులు దాసరి కోటయ్య, ఎంపిడిఓ భవానిలు భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ భవాని మాట్లాడుతూ ఒక్కొక్క బస్సు షెల్టర్‌కు రూ.3 లక్షలు కేటాయిస్తున్నట్లు చెప్పారు. జిల్లా పరిషత్ నిధుల నుంచి మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు చేవూరు నాగేశ్వరరావు, గూడలి పంచాయతీ కార్యదర్శి కిరణ్, పంచాయతీరాజ్ ఏఇ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## వన్యప్రాణులపై అవగాహన పెంచుకోండి - డిఎఫ్ఓ శామ్యూల్

దొరవారిసత్రం, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త దొరవారిసత్రం మండలం నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రంలో గురువారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల పరిధిలోని మావిళ్లపాడులోని మోడల్ స్కూలులో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వన్యప్రాణుల జీవనశైలిపై వ్యాసరచన పోటీలు జరిగాయి. ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం సూళ్లూరుపేట వన్యప్రాణి విభాగం డిఎఫ్ఓ శామ్యూల్ మాట్లాడుతూ వన్యప్రాణులపై అవగాహన పెంచుకోవాలని, ముఖ్యంగా మూగజీవులైన జంతువులు, విదేశీ విహంగాల వల్ల ఉపయోగాలను తెలియజేశారు. రేంజర్ వరప్రసాద్, స్థానిక సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ముగిసిన ఏపీఎస్ ఆర్టీసీ రోడ్డు భద్రతా వారోత్సవాలు



గూడూరు, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త రోడ్డు ప్రమాదాల్లో ఆర్టీసీ బస్సులకు చాలా తక్కువ శాతం ప్రమాదాలు జరుగుతున్నా యని, రాబోయే రోజుల్లో పూర్తిస్థాయిలో ప్రమాద రహిత ఆర్టీసికి డ్రైవర్లు కృషి చేయాలని గూడూరు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ జాకీర్ వెల్లడించారు. గురువారం గూడూరులోని ఆర్టీసీ డిపో కార్యాలయంలో జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాల ముగింపు సమావేశం నిర్వహించారు. ఈకార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ జాకీర్ మాట్లాడుతూ రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. ఆర్టీసీ డ్రైవర్లు డ్యూటీలో నిబద్ధతగా మనసు ప్రశాంతంగా ఉంచుకొని డ్రైవింగ్ చేసి బస్సులోని ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ నాగేశ్వరరావు, డ్రైవర్లు, కండక్టర్లు, గ్యారేజ్ సిబ్బంది పాల్గొన్నారు.

## వైసీపీ సర్కార్‌కు రోజులు దగ్గరపడ్డాయి - మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

కోట, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త వైసీపీ సర్కార్‌కు రోజులు దగ్గరపడ్డాయని గూడూరు మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ చెప్పారు. గురువారం మండలంలోని చంద్రశేఖరపురంలో ఇదేమి ఖర్మ అనే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గ్రామంలోకి మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ రావడంతో ఆయనపై పూల వర్షం కురిపిస్తూ హారతులు పట్టి ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా సునీల్‌కుమార్ మాట్లాడుతూ మూడున్నరేళ్ల కాలంలో వైసీపీ పాలనలో అభివృద్ధి ఏమీ జరగలేదన్నారు. ఇసుక మాఫియా, లిక్కర్ మాఫియా, దాచుకో దోచుకో అన్న రీతిలోనే పాలన సాగిందే తప్ప అభివృద్ధి లేదన్నారు. మరో సంవత్సరం రోజులు ఓపిక పడితే తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని, అన్ని సమస్యలను పరిష్కరిస్తామని పాశం హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మస్తాన్‌బాషా, వెంకన్నపాలెం సర్పంచ్ మధుయాదవ్, ఎంపిటిసి సురేష్, పట్టణ అధ్యక్షుడు షంషుద్దిన్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రద్దగుంటలో యువకుని ఆత్మహత్య

తడ, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త తడ మండలం గ్రద్దగుంటలో నీరువాయి లోకేష్ (24) అనే యువకుడు ఆత్మహత్యకు పాల్పడినట్లు గురువారం తడ పోలీసులు తెలిపారు. గత నెల 27న పొలాల్లో పిచికారి చేసే కలుపు గడ్డి నివారణ మందును తాగి ఈ యువకుడు కోమాలోకి వెళ్లిపోయాడని, అనంతరం చెన్నై ఆసుపత్రికి తరలించగా బుధవారం సాయంత్రం మృతిచెందినట్లు తమకు ఫిర్యాదు అందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడు తడకు సమీపంలోని శ్రీసిటిలోని ఒక కంపెనీలో పనిచేస్తుండగా, అతని భార్య మాంబట్టు వద్దనున్న అపాచి కంపెనీలో పనిచేస్తున్నట్లు తెలిపారు. కుటుంబంలో తలెత్తిన స్వల్పవివాదం కారణంగా క్షణికావేశంలో ఈ యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి మృతిచెందినట్లు పోలీసులు చెప్పారు.

## రాఘవయ్యపేట సచివాలయాన్ని సందర్శించిన ఆర్డీఓ

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త



సూళ్లూరుపేట పట్టణంలోని రాఘవయ్యపేట సచివాలయాన్ని గురువారం ఆర్డీఓ చంద్రముని సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ పనిచేసేసిబ్బందితో మాట్లాడారు. కార్యాలయానికి వచ్చే ఫిర్యాదిదారులు, స్థానికులతోఏవిధంగా నడుచుకోవాలో చర్చించారు. ప్రభుత్వం ద్వారా అన్ని సేవలను సకాలంలో అందించాలని చెప్పారు. ఆయన వెంట తహశీల్దార్ కె.రవికుమార్, కమిషనర్ ఎన్.నరేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రాజన్న రాజ్యం జగన్‌తోనే సాధ్యం - ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

దొరవారిసత్రం, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త రాజన్న రాజ్యం జగనన్నతోనే సాధ్యమవుతుందని సూళ్లూరుపేట ఎమ్మెల్యే, టిటిడి బోర్డు సభ్యులు కిలివేటి సంజీవయ్య అన్నారు. గురువారం దొరవారిసత్రం మండలం కొత్తపల్లి సచివాలయం పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సూళ్లూరుపేట శ్రీచెంగాళమ్మ ఆలయ ట్రస్టుబోర్డు ఛైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వం నుంచి లబ్ధి పొందిన రాయితీలు, పథకాలపై వివరాల పోస్టర్లు అందజేశారు. ఎమ్మెల్యే సంజీవయ్య మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను పూర్తి చేసి ప్రజల మనసులో చిరస్థాయిగా నిలిచిపోతున్నారని అన్నారు. రాబోయే ఎన్నికల్లో కూడా జగన్‌మోహన్‌రెడ్డికే అందరూ ఓట్లు వేసి ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. వీరితో పాటు నాయకులు గోపిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, పూర్ణనాయుడు, మండల వైసీపీ కన్వీనర్ శ్రీనివాసులురెడ్డి, మండల స్థాయి అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## గూడూరు టిడిపి ఎన్నికల పరిశీలకులుగా మురళీ కన్నబాబు



గూడూరు, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త గూడూరు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ పరిశీలకులుగా టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ గూటూరు మురళీ కన్నబాబును తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు నియమించారు. గురువారంఆయన గూడూరు మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ నివాసంలో భేటీ అయ్యారు. పరిశీలకులుగా మొదటిసారి నియోజకవర్గానికి వచ్చిన కన్నబాబుని శాలువాతో సత్కరించి స్వాగతం పలికారు. గూడూరు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ సంస్థాగత నిర్మాణం,కమిటీలు,నియోజకవర్గంలోజరుగుతున్నపార్టీ కార్యక్రమాలు, తదితర అంశాల పట్ల చర్చించారు.

## కేంద్ర బడ్జెట్‌పై హర్షం

కోట, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ పలు వర్గాలను మెప్పించిందని బిజెపి సీనియర్ నాయకుడు పెల్లేటి గోపాల్‌రెడ్డి అన్నారు. ఆయన గురువారం కోటలో విలేఖరులతో మాట్లాడుతూ ఆదాయ పన్ను శ్లాబ్‌లో మార్పులు, పరిమితి పెంచడం, మధ్యతరగతి వేతన జీవుల్లో సంతోషాన్ని నింపిందన్నారు. ఉపాధి హామీ పథకంలో రైతులకు ఎక్కువగా వినియోగించే యూరియా సబ్సిడీ కేటాయింపులు, ఆదాయ పన్ను పరిమితిని రూ.7 లక్షల వరకు పెంచడంతో మధ్యతరగతి కుటుంబాలకు ఊరట లభించినట్లు తెలిపారు. కొత్త ఆదాయం పన్ను విధానంలో నెలకు రూ.62 వేలు జీతం లేదా ఆదాయం పొందిన వారు పన్ను పరిధిలోకి వచ్చే అవకాశం లేదని చెప్పారు. దీంతో వేలాది మంది ఉద్యోగులు, వ్యాపారులు పన్ను మినహాయింపులోకి వస్తారని చెప్పారు. ముందెన్నడూ లేనివిధంగా విద్య, వైద్య, వ్యవసాయ రంగాలకు పెద్దపీట వేశారని పేర్కొన్నారు.

## రోడ్డుప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలు ...

నాయుడుపేట రూరల్ ఫిబ్రవరి 2 ప్రభాతవార్త నాయుడుపేట మండలంలోని పండ్లూరు సమీపంలో జరిగిన రోడ్డుప్రమాదంలో గురువారం ముగ్గురు యవకులు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలిలా ఉన్నాయి. ఓజిలికి చెందిన విజయ్‌కుమార్, రమేష్, అశోక్‌లు మోటార్‌సైకిల్‌పై నాయుడుపేటకు వచ్చి పనులుపూర్తి చేసుకొని తిరిగి స్వగ్రామమైన ఓజిలికి వెళుతుండగా మార్గమధ్యలో పండ్లూరు సమీపంలోకి వచ్చేసరికి ఎదురుగా వస్తున్న లారీని తపి ్పంచబోయి ప్రమాదవశాత్తు మోటార్‌సైకిల్ అదుపుతప్పి బోల్తాపడింది.దీంతో మోటార్‌సైకిల్‌పై ప్రయాణిస్తున్న యువకులు తీవ్రంగా గాయపడ్డారు.స్థానికులు గుర్తించి క్షతగాత్రులను 108లో చికిత్సనిమిత్తం నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

## జగన్‌ను సీఎం చేయడమే లక్ష్యంగా పనిచేయాలి - వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త:



జగన్మోహన్‌రెడ్డిని మరలా సీఎంగా చేయడమే లక్ష్యంగా పార్టీ కార్యకర్తలు, నాయకులు పని చేయాలని రాష్ట్ర కమిటీ ఛైర్మన్, నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలి పారు. డక్కిలి మండలంలోని పలువురు ఎంపీటీసీలు, సర్పం చులు, సీనియర్ నాయకులు రామ్‌కుమార్‌రెడ్డిని వెంకటగిరిలోని ఆయన నివాస గృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. వైసీపీ పార్టీ కోసం అందరూ కలిసికట్టుగా పని చేయాలని తెలిపారు. వెంకటగిరి నియోజకవర్గంలో వైసీపీకి భారీ మెజారిటీ రావాలని చెప్పారు. డక్కిలి మండలంలో తాను ఇంటింటికి తిరుగుతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కలువాయి జెడ్పీటీసీ అనిల్‌కుమార్‌రెడ్డి, నెల్లూరు రీజియన్ ఆర్టీసీ మాజీ ఛైర్మన్ శంకర్‌రెడ్డి, నాయకులు సురేష్‌రెడ్డి, దర్శనంరెడ్డి, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కోటలో ఆర్టీసి స్థలాల పరిశీలన

కోట, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త కోటలోని ఆర్టీసీ ప్రాంగణంలో ఖాళీ స్థలాలను గురువారం డిప్యూటి ఇంజనీర్ చెన్నకేశవరావు, ఏఇ కోటేశ్వరరావు పరిశీలించారు. రెండు బిట్లుగా విభజించి 15 సంవత్సరాల పాటు లీజు ఇచ్చేందుకు ప్రతిపాదనలు చేస్తున్నామని చెన్నకేశవరావు తెలిపారు. అంతకుముందు లీజుదారులతో ఆయన సమావేశం నిర్వహించారు. గత కొంతకాలంగా తాము వ్యాపారాలు చేసుకుంటున్నామని, తమకు లీజు పట్టాలు ఇవ్వాలని కొంతమంది చిరు వ్యాపారులు కోరారు. ఆర్టీసీ ఉన్నతాధికారులతో మాట్లాడి ఈ సమస్యను తెలియజేస్తామని వారు చెప్పారు.

# వాహనాల రక్షణకోసం డాడీస్‌రోడ్ యాప్



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త

వాహనాల రక్షణకోసం డాడీస్‌రోడ్ యాప్‌ను శ్రీకాళహస్తి ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ అంజూరుతారకశ్రీనివాసులు, డిఎస్పీ ధర్మవరపు విశ్వనాథ్‌లు గురువారం లాంఛనంగా ఆవిష్కరించారు. ఈ సందర్బంగా ముఖ్యఅతిధులు మాట్లాడుతూ విద్యానిధి వాహన పరిరక్షణకు డాడీస్ యాప్ ఎంతో దోహపడుతుందని, ఈయాప్‌లోని క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడంతో సంబంధిత వాహనదారునికి ఫోన్‌ద్వారా సమాచారం అందుతుందని తద్వారా వాహనదారుడు తన వాహనాలను రక్షించుకోవచ్చని తెలియజేశారు. ఏవ్యక్తి వాహనం వల్ల కానీ, తమ వాహనంకు ఇబ్బంది కలిగినా వెంటనే సంబందిత యజమాని సెల్‌పోన్‌కు సందేశం వెళ్తుందన్నారు. క్యూఆర్ కోడ్ ద్వారా వాహన స్థితిగతులను తెలుసుకోవచ్చన్నారు. ప్రమాదం జరిగినా, బ్లడ్‌బ్యాంకు ద్వారా రక్తం అవసరమైన పార్కింగ్ సమస్య వచ్చినా, వాహన డాక్యుమెంట్లో యాప్లో పొందుపరచుకోవడం కోసం, వాహనం ఏదైనా రిస్కులో ఉన్నా ఇలా పలు ఉపయోగాలతో కూడిన యాప్‌ను అందుబాటులోకితీసుకురావడం అభినందనీయం అని నిర్వాహకులను అభినందించారు. వాహనాలు ఉన్న వారు ప్రతి ఒక్కరు గూగుల్ ప్లేస్టోర్‌లో యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఆర్టీసి డిఎం రాజవర్ధన్‌రెడ్డి , ఎఎస్ఐ రిజాయ్‌బాషా, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## సుమన్‌నాయుడును సన్మానించిన విజయబాబు

నగరి, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త:



నగరి మండలంలోని ఓజీ కుప్పం రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి సుమన్‌నాయుడును నగరి టీడీపీ నాయకుడు పోతు గుంట విజయబాబు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. పార్టీ అభివృద్ధికి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు సుమన్‌నాయుడు కృషి చేస్తున్నారని విజయబాబు అభిప్రాయ పడ్డారు. అనంతరం గజమాల, శాలువతో ఘనంగా సత్కరించారు. రాష్ట్ర టీడీపీ వాణిజ్య విభాగ కార్యదర్శి రవినాయుడు, మాజీ ఎంపీటీసీ ధనపాల్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు వేలు, ఎస్సీ సెల్ నియోజకవర్గ నాయకులు సుబ్రహ్మణ్యం, రవియాదవ్, ముని, వంశి, అప్పయ్య, రమేష్, గాలికృష్ణమనాయుడు, ఎం. రవినాయుడు, మారిముత్తురెడ్డి, శీనురెడ్డి పాల్గొన్నారు.

## రెవెన్యూ సమస్యల పరిష్కారంలో వీఆర్‌వోలదే బాధ్యత

కేవీబీ పురం, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త:



ప్రతి గ్రామ వీఆర్‌వో రికార్డులను తహసీల్దార్ రెవెన్యూ కార్యాలయంలో రికార్డుల ప్రకారం ఉంటేనే వినియోగదారునికి రికార్డులను అందించాలని తహసీల్దార్ ద్వారకానాథరెడ్డి వీఆర్‌వోలకు పలు సూచనలు అందించారు. గురువారం మండల కేంద్రమైన కేవీబీ పురంలో తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్‌వోలతో సమీక్ష సమాశం తహసీల్దార్ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ కాలువ పొరంబోకు, తదితర భూమి వివరాలను పరిశీలించి రికార్డులు నమోదు చేసేటప్పుడు గ్రామసభలో పట్టాదారునికి ఆ భూమిలోఉన్న నలుమూలల వారి వివరాలను కూడా సేకరించి వారితో కూడా ఎలాంటి అవరోధాలు లేవని వారి నుంచి ఆమోదం పొంది రెవెన్యూ పలు రికార్డులను ఇప్పించేందుకు ఆమోదించాలని రెవెన్యూ సమస్యలపై పరిష్కరించడం వీఆర్‌వోలదే బాధ్యతని తెలిపారు. వీఆర్‌వోలు రెకమండేషన్ చేస్తే తదుపరి కార్యక్రమాలు మొదలవుతాయని కనుక రెవెన్యూ అధికారులు రికార్డుల పంపిణీ విషయంలో సూచనలు అందించారు. ఈ సందర్భంగా సమావేశాన్ని ప్రతి పంచాయతీ పరిధిలో ప్రతి రెవెన్యూ సమస్యలపై ఆ సచివాలయ వీఆర్‌వోలతో చర్చించి పలు సూచనలు అందించారు. మండలంలోని అన్ని పంచాయతీల్లోని రెవెన్యూ రికార్డులను వీఆర్‌వోల ద్వారా సమీక్షించారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ మునిరత్నం, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సుబ్రహ్మణ్యం, ఏఎస్‌వో మల్లీ, వీఆర్‌వోలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## డిప్యూటీ తహసీల్దార్‌కు ఘన సన్మానం

కేవీబీ పురం, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త:



ఉత్తమ అవార్డు పొందిన డిప్యూటీ తహసీల్దార్ మునిరత్నంను మండల సీనియర్ వైసీపీ నాయకుడు, జిల్లా రైతు అధ్యక్షుడు లోకనాథరెడ్డి గురువారం తహసీల్దార్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. మరెన్ని పదవులను పొందాలని ఇది నిర్వహణ బాధ్యత కలిగిన ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తున్నారని, అటువంటి పదవులు ఆ భగవంతుడు ఆయురారోగ్యాలు కల్పించాలని ఆయనను ప్రశంసించారు. అనంతరం మునిరత్నంను శాలువలతో, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ద్వారకానాథరెడ్డి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సుబ్రహ్మణ్యం యాదవ్, ఏఎస్‌వో మల్లి, తదితరులు పాల్గొన్నారు.

## తెలుగు తమ్ముడికి "పులివర్తి వినీల్" పరామర్శ

చంద్రగిరి, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త:



తెలుగుదేశం పార్టీలో క్రియాశీలక కార్యకర్తగా పార్టీకి విశిష్ట సేవలందిస్తున్న ఉగ్రాణం కిషోర్ రెడ్డిని పులివర్తి వినీల్ పరామర్శించారు. స్థానిక పాతపేటకు చెందిన ఉగ్రాణం కృష్ణారెడ్డి కాలం చేశారు. గురువారం కర్మక్రియలను పురస్కరించుకుని టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జ్ పులివర్తి నాని తనయుడు పులివర్తి వినీల్ హాజరయ్యారు. దివంగత కృష్ణారెడ్డి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, కిషోర్‌కు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆయన కొంత సమయం మమేకమయ్యారు .

## శ్రీ కావమ్మ మారయ్యకు సారె, పంచె కార్యక్రమం

పుత్తూరురూరల్, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త:



పుత్తూరు పట్టణంలోని కార్వేటినగరం రోడ్డులో వెలసిన శ్రీ కావమ్మ మారయ్య దేవాలయంలో తిరుణాళ్ల సందర్భంగా స్వామివారికి అమ్మవారికి సారె, పంచె కార్యక్రమాన్ని 10 గంటలకు నిర్వహించారు. ఉదయం ఆలయంలో అమ్మవారికి, స్వామివారికి ప్రత్యేక పుష్పాలతో అలంకరించి పూజలు చేశారు. అనంతరం మధ్యాహ్నం ఆలయ ఆవరణలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పొంగళ్లు పెట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. రాత్రి స్వామివారిని అమ్మవారిని పురవీధుల్లో ఊరేగించారు. బుర్రకథ కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

**నేడు ఆలయంలో కార్యక్రమాలు**శ్రీ కావమ్మ మారయ్య తిరుణాళ్ళ సందర్భంగా స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు రాత్రి మంచినీటితో జ్యోతిని వెలిగించే కార్యక్రమం అనంతరం అగ్నిగుండ ప్రవేశం కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు శ్రీ కావమ్మ మారయ్య పుత్తూరు బెస్త సేవా సంఘం తెలిపారు.

## ఆలయ పునర్నిర్మాణానికి దాతల వితరణ

ఆలయ ఈఓ పుట్టా రామకృష్ణారెడ్డి

చంద్రగిరి, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త:



చంద్రగిరి గ్రామదేవత శ్రీమూలస్థాన ఎల్లమ్మ వారి ఆలయ పునర్నిర్మాణానికి దాతలు తమ వంతు వితరణలతో సహకరిస్తున్నట్లు ఆలయ ఈఓ పుట్టా రామకృష్ణారెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా తిరుపతి రూరల్ మండలానికి చెందిన రెడ్డెప్పగారి చంద్రశేఖర్ రెడ్డి రూ.1,00,000/-లు, అయ్యప్పనేని అమర్నాథ్ రెడ్డి కుటుంబ సభ్యులు 1,01,116/-లు చెక్‌లను ఆలయ ఛైర్మన్ యారాశి చంద్రశేఖర్ రెడ్డి, ఈఓకు అందజేశారు. ఈ సందర్భంగాఆలయఈఓ దాతల కుటుంబ సభ్యులకు అమ్మవారి దర్శన ఏర్పాట్లు గావించి, తీర్థప్రసాదాలు అందజేశారు.

## అక్రమ రవాణా చేస్తున్న ప్లాస్టిక్ వస్తువులు స్వాధీనం

నగరి, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త:



మున్సిపల్ పరిధిలో అక్రమ రవాణా చేస్తున్న ప్లాస్టిక్ వస్తువులను మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి స్వాధీనం చేసుకున్నారు. గురువారం పట్టణ పరిధిలో నిర్వహించిన తనిఖీలో భాగంగా ప్లాస్టిక్ వస్తువుల రవాణా బయటపడింది. స్వాధీనం చేసుకున్న ప్లాస్టిక్ వస్తువుల విలువ రూ.10 వేలకుపైనే ఉంటుందని కమిషనర్ తెలిపారు. ప్రభుత్వం ప్లాస్టిక్ నిషేధం విధించి అమల్లో ఉందని ప్లాస్టిక్ విక్రయాన్ని వినియోగాన్ని ప్రతి ఒక్కరు మానుకోవాలని ఆయన సూచించారు. ప్రతి వార్డులోను ప్లాస్టిక్ వినియోగంపై ఆరా తీసేందుకు టాస్క్‌ఫోర్స్ కమిటీ ఉందన్నారు. ఈ తనిఖీలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ భూపాల్, శానిటరీ సెక్రటరీలు పురుషోత్తం, కుమార్, వాసు, పీహెచ్ మేస్త్రీలు పాల్గొన్నారు.

## ప్రతి మూడునెలలకోసారి

కళ్ళ స్క్రీనింగ్ పరీక్ష చేసుకోండి -ఉచిత వైద్యశిబిరంలో డాక్టర్ సుధారాణి

తిరుపతినగరం, ఫిబ్రవరి 2ప్రభాతవార్త:



డయాబెటీస్ ఉన్న వారు ప్రతి ఒక్కరూ మూడునెలలకోసారి కంటి స్క్రీనింగ్ పరీక్షలు చేసుకోవాలని, మధుమేహ వ్యాధిని అదుపులో ఉంచుకుంటే డయాబెటిక్ రెటినోపతి బారిన పడకుండా ఉండవచ్చని సాయిసుధా కంటి ఆస్పత్రి అధినేత్రి, కంటి వైద్యనిపుణులు డాక్టర్ రాళ్ళపల్లి సుధారాణి తెలిపారు. సున్నితమైన కంటికి సంబంధించి కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం వల్ల కంటి చూపుకోల్పోకుండా కాపాడుకోవచ్చని చెప్పారు. గురువారం ఉదయం తిలక్‌రోడ్డులోని సాయిసుధ కంటి ఆస్పత్రిలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. పాల్గొన్న రోగులకు ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి, సూచనలు చేశారు. అనంతరం ఉచితంగా మందులు, కళ్ళజోడ్లుపంపిణీచేశారు. కంటి ఆస్పత్రి సిబ్బంది హిమబిందు, పురుషోత్తం, ధరణి, సునీత పాల్గొన్నారు.

## నేడు సాయిసుధ ఆర్థోఆస్పత్రిలో ఉచిత బిఎండి పరీక్షలు

తిరుపతినగరం, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త:

ఎముకల సాంద్రతపై, మోకీళ్ళు నొప్పులతో బాధపడుతున్న రోగులకు ఉచితంగా బిఎండి వైద్యపరీక్షలను శుక్రవారం ఉదయం రెడ్డిరెడ్డికాలనీలోని సాయిసుధ సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిలో నిర్వహిస్తున్నట్లు ఆస్పత్రి ఎండి డాక్టర్ బి.సుకుమార్ తెలిపారు. ఉదయం 9గంటలనుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఈ ఉచిత బిఎండి పరీక్షల శిబిరం ఉంటుందన్నారు.

## టూ వీలర్ పార్కింగ్ స్టాండ్ నిర్వహణకు దరఖాస్తుల ఆహ్వానం

-ఆర్టీసీ అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ డిఆర్.నాయుడు

తిరుపతి ప్రెస్‌క్లబ్, జనవరి 2 ప్రభాతవార్త:

స్థానిక ఏపిఎస్‌ఆర్టీసీ సెంట్రల్ బస్‌స్టేషన్‌లోని రెండు ప్రదేశాలలో టూ వీలర్ పార్కింగ్ స్టాండ్‌లను అద్దె ప్రాతిపదికన నిర్వహించుకోవడానికి ఆసక్తి గలవారి నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బస్‌స్టేషన్ అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ డి.రామచంద్రనాయుడు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ టెండరు 6 నెలలు కానీ, లేదా రీజనల్ టెండర్లు వచ్చేంత వరకు కేటాయించబడుతుందన్నారు. ఈ దరఖాస్తులు తిరుపతి డిపో మేనేజర్ ఆఫీసు నందు నేటి నుండి 10వ తేదీ వరకు ఆఫీసు పని వేళల్లో ఇవ్వబడుతుందన్నారు వివరాలకు 7382874708/ 9959225684 నెంబర్లను సంప్రదించాలన్నారు.

## బిజెపి పట్టణ అధ్యక్షులుగా రమేష్‌బాబు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి పట్టణ బిజెపి అధ్యక్షులుగా పట్టణ సీనియర్ బిజెపి నాయకుడు గరికపాటిరమేష్‌బాబును నియమిస్తున్నట్లు తిరుపతి పార్లమెంటు జిల్లా అధ్యక్షులు సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి గురువారం ఉత్తర్వులు జారీచేశారు. ఈసందర్బంగా రమేష్‌బాబు మాట్లాడుతూ తనకు పదవిరావడానికి కృషిన తన మిత్రుడు రాష్ట్ర మీడియా ప్రతినిధి, నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోలా.ఆనంద్‌కుమార్‌కు ధన్యవాదాలు తెలిపారు. బిజెపి పార్టీని బలోపేతం చేయడానికి తనవంతు శక్తివంచనలేకుండా కృషిచేస్తానన్నారు. త్వరలోనే పట్టణ నూతన కమిటీ సభ్యులను కూడా నియమిస్తున్నామని తెలిపారు. ఈసందర్బంగా రమేష్‌బాబుకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

## తారక కోలుకోవాలని తొండమాన్ పురంలో పూజలు

శ్రీకాళహస్తిరూరల్, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త



యువగళం పాదయాత్ర ప్రారంభోత్సవానికి వచ్చిన సినీనటుడు తారక రత్న అనారోగ్యంతో స్పృహతప్పి పడిపోవటంతో ఆసుపత్రిలో చేర్చిన విషయం విదితమే. అయితే ఆయన త్వరగా కోలుకోవాలని కోరుతూ తెలుగుదేశం మద్దతు దారులు, మండల తెలుగు దేశం ఇన్‌చార్జి సారధ్యంలో తొండమాన్‌పురంలోని ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం పూజలు నిర్వహించారు. శ్రీకాళహస్తి మండలంలోని తొండమాన్‌పురంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వరస్వామి మహిమాన్వితుడు. మండల కన్వీనర్ కామేష్‌యాదవ్ సారధ్యంలో సుమారు 500 మంది కార్యకర్తలు కొబ్బరి కాయలు కొట్టారు. ఈ కార్యక్రమాల్లో యూనిట్ ఇన్‌చార్జి వై.దామోదర్‌రెడ్డి, ఈశ్వరరెడ్డి, మునస్వామి, విజయకుమార్, సురేంద్రరెడ్డి, రవి, మహేష్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి పెద్దమునిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అనుబంధ ఆలయాల్లో బాలాలయ స్థాపన పూజలు

తొట్టంబేడు/శ్రీకాళహస్తిరూరల్, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధ ఆలయాలుగా తొట్టంబేడు మండలం పెద్దకన్నలి గ్రామంలో వెలసిన అగస్తీశ్వరస్వామి ఆలయం, శ్రీకాళహస్తి మండలంలోని ఊరందూరు గ్రామంలో వెలసిన నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు అంజూరుతారకశ్రీనివాసులు, అర్చకులు ఆధ్వర్యంలోశాస్త్రోక్తంగా వేదమంత్రోచ్ఛారణల మధ్య బాలాలయ స్థాపన కార్యక్రమాలు చేపట్టారు. ఈనెల 13 నుంచి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు జరుగుతుండడంతో ఆలయ ఛైర్మన్ అంజూరుతారకశ్రీనివాసులు ఎంఎల్‌ఏ బియ్యపుమధుసూధన్‌రెడ్డి ఆదేశాల మేరకు అనుబంధ ఆలయాలపై ప్రత్యేక దృష్టిసారించారు. అంతేకాకుండా భక్తకన్నప్ప ఆలయంలో ధ్వజస్తంభ బాలాలయ స్థాపన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కార్యక్రమాల్లో ఆలయ అర్చకులు, శ్రీకాళహస్తీశ్వరాలయధర్మకర్తలమండలిసభ్యులు, ప్రత్యేకాహ్వానితులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## కష్టజీవుల కడుపుకొట్టే బడ్జెట్‌పై నిరసన

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త



గ్రామీణ కష్టజీవుల కడుపుకొట్టే బడ్జెట్‌ను వ్యతిరేకించాలని రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సహాయక కార్యదర్శి చిన్నంపెంచలయ్య, జిల్లా అధ్యక్షులు జె.తులసీరాజన్‌లు డిమాండ్ చేశారు. ఈసందర్బంగా వీరు మాట్లాడుతూ పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ గ్రామీణ కష్టజీవుల కడుపు కొట్టే విధంగా పేదలను నిరాశపరచే విధంగా ఉందని ఇందుకు నిరసనగా స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. బడ్జెట్ దేశంలోని రైతులు, గ్రామీణ కూలీల సంక్షేమం విస్మరించడం తగదని కేంద్రప్రభుత్వాన్ని హెచ్చరించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంకు గత బడ్జెట్‌లో రూ.89వేల కోట్లు కేటాయించగా 2023-24 బడ్జెట్‌లో కేవలం రూ.60వేల కోట్లతోనే సరిపెట్టిందన్నారు. ఉపాధిహామీకి భారీగా కోత పెట్టడం వల్ల గ్రామీణ కష్టజీవులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. సిపిఐ ఏరియా కార్యదర్శి జనమాలగురవయ్య మాట్లాడుతూ రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం, వామపక్ష పార్టీలు గత నాలుగేళ్ళుగా ఉపాధిహామీ పనులు 100రోజులు సరిపోవని 200రోజులు కల్పించాలని రూ.600లు రోజుకు వేతనం ఇవ్వాలని పోరాటాలు చేస్తున్నా ఏమాత్రం పట్టించుకోకుండా బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం బాధాకరం అన్నారు. ఇది మోసపూరిత బడ్జెట్ అని తీవ్రంగా విమర్శించారు. కార్యక్రమంలో కత్తిధర్మయ్య, శివకుమార్, శ్రీనివాసులు, గోపి, రాజయ్య తదితరులు పాల్గొన్నారు

## ముగిసిన రోడ్డు భద్రతా వారోత్సవాలు

-ఉత్తమ డ్రైవర్లకు సత్కారం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త



రోడ్డు భద్రతా వారోత్సవాల ముగింపు సందర్భంగా గురువారం ఎపిఎస్‌ఆర్టీసి గ్యారేజీ ఆవరణలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా డిఎస్పీ ధర్మవరపు విశ్వనాథ్, టూటౌన్ ఎస్ఐ మహేష్‌లు పాల్గొన్నారు. ఈసందర్బంగా డిపో మేనేజర్ రాజవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ సెల్‌ఫోన్ డ్రైవింగ్ ప్రమాదకరమని ప్రతి డ్రైవరు మంది ఆహారం, విశ్రాంతి తీసుకుని విధులకు హాజరుకావాలని తెలిపారు. రద్దీ ఉన్న సమయాల్లో జాగ్రత్తగా డ్రైవింగ్ చేయాలన్నారు. ఓవర్‌టేక్ చేసేటపుడు జాగ్రత్తలు పాటించాలన్నారు. మద్యపానం చేసి డ్రైవింగ్ చేయడం వల్లనే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. అనంతరం ప్రమాదరహిత డ్రైవర్లు ఎం.వెంకటేశ్వర్లు, జె.అమీర్, జి.సుబ్బయ్యలను దుశ్శాలువ, పూలమాలతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో మెకానికల్ ఇంజినీర్ చక్రవర్తి, అసిస్టెంట్ మేనేజర్ చిట్టెమ్మ, ఎఎస్ఐ వెంకటేశ్వర్లు, యూనియన్ నాయకులు, డిపో సిబ్బంది, ఆటో డ్రైవర్లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## శ్రీసిటీని సందర్శించిన తెలుగుగంగ ఛీఫ్ ఇంజనీర్

సత్యవేడు, ఫిబ్రవరి 2,ప్రభాతవార్త:





తిరుపతి తెలుగుగంగ ప్రాజెక్టు ఛీఫ్ ఇంజనీర్ శ్రీనివాసులురెడ్డి ఇతర సీనియర్ ఇంజనీర్లు బృందంతో కలిసి శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ డైరెక్టర్ ముకుందరెడ్డి ఆయనకు సాదరస్వాగతం పలికారు. శ్రీసిటీ ప్రత్యేకతలు, నీటి సంరక్షణ చర్యలు, వర్షపునీటి సేకరణ, పరిశ్రమలకు నీటి అవసరాలు, మురుకినీటి శుద్ధి, పునర్వినియోగం గురించి ఆయనకు వివరించారు. తెలుగు గంగ ప్రాజెక్టు నుండి నీటి కేటాయింపులు, ఇతర సంబంధిత అంశాలను ఈసంధర్భంగా ఛీఫ్ ఇంజనీర్ సమీక్షించారు. శ్రీసిటీ వేగవంతమైన పారిశ్రామికాభివృద్ధిని ప్రశంసిస్తూ నీటి నిర్వాహణ, వర్షపునీటి సంరక్షణకు శ్రీసిటీ చేస్తున్న కృషిని కొనియాడారు. శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి తన ప్రకటనలో పారిశ్రామికవాడలో నీటి సంరక్షణ, నీటి నిల్వప్రాంతాలను పరిశీలించడంతో పాటు, తెలుగుగంగ నీటి కేటాయింపులపై సమీక్ష జరిపినందుకు సీఈకి ధన్యవాదాలు తెలిపారు. ఈ పర్యటనలో శ్రీకాళహస్తి ఎగ్జిగ్యూటివ్ ఇంజనీరు సుబ్రమణ్యం కూడా ఉన్నారు.

## కబ్జా కోరల్లో బలిజ భవన్!

-ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బలిజ జేఏసి విజ్ఞప్తి

తిరుపతి ప్రెస్‌క్లబ్, జనవరి 2 ప్రభాతవార్త:



స్థానిక నరసింహతీర్థం రోడ్డులోని 'బలిజ భవన్' కబ్జా దారుల కోరల్లో ఇరుక్కుందని, ప్రభుత్వం స్పందించి తగిన చర్యలు తీసుకుని దానిని రక్షించాలని బలిజ జేఏసి అధ్యక్షుడు నీలం బాలాజి, కాపు సంక్షేమ యువసేన రాష్ట్ర అధ్యక్షుడు ఆర్కాట్ కృష్ణప్రసాద్‌లు విజ్ఞప్తి చేశారు. గురువారం వీరు 100 మంది బలిజ నాయకులతో కలిసి బలిజ భవన్ నిర్మాణంలో ఉన్న స్థలం వద్దకు వెళ్లి పరిశీలించారు. గతంలో కబ్జాకు గురైన స్థలమే కాకుండా, పక్కనున్న స్థలాన్ని సైతం కబ్జా చేసేందుకు ప్రహరీ కమ్ములతో సహా సిద్ధం చేసి ఉండటాన్ని నాయకులు గమనించి ఆందోళన వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో కాపునాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు డా॥కరుణానిధి, కాపు నాయకులు ఆళ్వార్ మురళి, క్రికెట్ విజయ్, అనిల్‌రాయల్, వెంకటేష్, రాజు రాయల్, జిఎస్.ప్రసాద్, చెంచుకృష్ణ, సుధీర్, శ్రీరామ్ గోపి, తదితరులు పాల్గొన్నారు.

## శివయ్య సేవలో కర్నాటక దేవాదాయశాఖ కమిషనర్

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయానికి అతిధుల తాకిడి పెరుగుతుంది. ముఖ్యంగా తమిళనాడు, కర్నాటకల నుంచి వివిపిలు విశేష సంఖ్యలో హాజరౌతున్నారు. ఈ నేపధ్యంలో గురువారం కర్నాటక దేవాదయాశాఖ కమిషనర్ రోహిణి సింధూరి కుటుంబసభ్యులతో ఆలయానికి వచ్చారు. ఆమెకు దక్షిణ గోపురం వద్ద ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయంలో స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం చేసుకున్న వారికి గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించారు. స్వామి అమ్మవార్ల తీర్థ ప్రసాదాలను ఎపిఆర్‌ఓ చంద్ర ఏర్పాట్లును పర్యవేక్షించారు.

## 19 నుంచి తొండమాన్ ఆలయంలో బ్రహ్మోత్సవాలు

తొండమాన్‌పురంలో కూడా గ్రామోత్సవం నిర్వహించండి

శ్రీకాళహస్తిరూరల్, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త



ఈ నెల 19 నుంచి శ్రీకాళహస్తి మండలం తొండమాన్‌పురంలో వెలసిన శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలకు ఆలయాన్ని సిద్దం చేస్తున్నారు. ఈ నేపధ్యంలో గురువారం టిటిడి అధికారులు ఇక్కడ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఉత్సవాల ఏర్పాటును పర్యవేక్షించారు. ఈ సందర్బంగా సర్పంచ్ గ్రామస్థులు వినతి పత్రం అందించారు. ప్రస్తుతం కొన్ని ప్రాంతాలవారికే గ్రామోత్సవం నిర్వహించబడుతుంది. అయితే తొండమాన్‌పురంలో గ్రామోత్సవాన్ని నిర్వహించాలని కోరారు. ఈ మేరకు గ్రామ సర్పంచ్ గ్రామస్తులు మాట్లాడుతూ అతి పురాతనమైన తొండమాన్ పురంలోని ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయం దేశంలోమరెక్కడా లేని విధంగా ఉందని వివరించారు. ఇక్కడ స్వామి కూర్చొని భక్తులకు దర్శనమిస్తారన్నారు. అతి పురాతనమైన ఆలయం శిధిలం కాగా టిటిడి 2008లో స్వాధీనం చేసుకొని జీర్ణోద్ధారణ గావించి 2016 కుంభాభిషేకం నిర్వహించినట్లు వివరించారు. 2017 నుంచి తొండమాన్ పురం గ్రామంలోని నాలుగుమాడావీధుల్లో ఉత్సవం నిర్వహిస్తున్నట్లు వివరించారు. 2019 నుంచి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించు గ్రామోత్సవంలో తమ గ్రామంలో కూడా ఉత్సవం నిర్వహించాలని తొండమాన్ పురం వాసులు కోరుతున్నామని వివరించారు. అయితే ఆగమ శాస్త్రం ప్రకారం దేవుడు గ్రామం పొలిమేరలు దాటరాదని పండితులు తెలిపారని వివరించారన్నారు. అలాగే రాబోవు బ్రహ్మోత్సవాల్లోనూ, పవిత్రోత్సవాలను సంప్రదాయం ప్రకారం నిర్వహించాలని సర్పంచ్ బి. హేమభూషణరెడ్డి, టికె శేఖర్‌రెడ్డి ,రాజమ్మ, గోపాల్‌రెడ్డి, కేశవులు వై.దామోదర్‌రెడ్డి, ఎం.నాగరాజు, ఎంవి రత్నం గ్రామస్తులు టిటిడి ఇఓకు గురువారం వినతి పత్రం అందించారు. సమావేశానికి డెప్యూటి ఇఓ దేవేంద్రరెడ్డి, ఎఇఓ పార్ధసారధి, తిరుచానూరు ఎఇఓ శైలేంద్రబాబు, ఆలయ ఇన్సెపెక్టర్ శ్రీనివాసులు, మహేష్, రవికుమార్‌రెడ్డిలు గ్రామస్థులతో సమావేశమై ఉత్సవాలకు సంబంధించి చర్చించారు.

## ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోండి

తొట్టంబేడు, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త



మండలకేంద్రంలోని(తొట్టంబేడు (గ్రామం) సచివాలయం-1లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆధార్‌కేంద్రాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ పంచాయతీ కార్యదర్శి హంస ప్రకాష్ ఓ ప్రకటనలో కోరారు. రాష్ట్ర ప్రభుత్వం మండల ప్రజల సౌకర్యార్థం సచివాలయాల్లో ఆధార్‌నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేసిందని మండలంలోని ప్రజందరు కొత్త ఆధార్‌కార్డులు మరియు ఆధార్‌కార్డులో మార్పులు చేర్పులు చేసుకోవాల్సిన వారు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సచివాలయ పనివేళల్లో మండలంలోని ప్రజలు ఆధార్ సేవలను పొందవచ్చన్నారు.

## యువగళంతో యువతలో నూతనోత్తేజం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త



తెలుగుదేశంపార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేష్ యువగళం పేరుతో చేస్తున్న పాదయాత్ర గురువారం పలమనేరు పట్టణంలోకి ప్రవేశించిన సందర్భంగా తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. యువగళంలో యువత నూతనోత్తేజంతో పాల్గొంటున్నారని తెలుగుదేశంపార్టీ రాష్ట్ర కార్యదర్శి మరియు పలమనేరు నియోజకవర్గ పరిశీకులు డాక్టర్ జి.దశరధాచారి అన్నారు. ఈసందర్బంగా నారాలోకేష్‌ను దశరధాచారి దుశ్శాలువతో సత్కరించారు. పలమనేరులోని ఆర్యవైశ్యులతో నారాలోకేష్ ప్రత్యేకంగా సమావేశమై వివిధ అంశాలపై వారితో చర్చించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి అమర్‌నాథ్, పలమనేరు నుంచి శ్రీకాళహస్తి నుంచి పలువురు కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.

## వర్షం వచ్చిందటే కొత్తకండ్రిగ నీటమునకే

-తెదేపా నాయకులకు మొర

తొట్టంబేడు, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త



వర్షం వచ్చిందంటే చిట్టత్తూరు పంచాయతీ కొత్త కండ్రిగ గ్రామంలో ఉన్న ఇండ్లలోకి నీరు ప్రవహించి జీనవం చేయలేని స్థితిలో జనం ఉన్నారని తెలుగుదేశంపార్టీ మండల అధ్యక్షుడు గాలిమురళీ నాయుడుకు మొరపెట్టుకున్నారు. తెలుగుదేశంపార్టీ జాతీయ అధ్యక్షుడు నారాచంద్రబాబునాయుడు, నియోజకవర్గ ఇన్‌ఛార్జిబొజ్జల సుధీర్‌రెడ్డి ఆదేశాల మేరకు గురువారం చిట్టత్తూరు పంచాయతీలో 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు మాట్లాడుతూ కొండ నుంచి వచ్చే నీరు ముఖ్యంగా వర్షాకాలంలో లక్ష్మీపురం, కొత్తకండ్రిగ గ్రామాల్లో ఇండ్లలోకి నీరు వచ్చి గ్రామం మొత్తం జలమయం అవుతోందని దీనికి శాశ్వత పరిష్కారం చూపాలని మొరపెట్టుకున్నారు. గ్రామంలో తెలుగుదేశంపార్టీకి ఓట్లు వేశారన్న కక్షపూరిత ధోరణితో రోడ్లను అధికారపార్టీ వేయలేదని దుయ్యబట్టారు. నిత్యావసరాలు ఆకాశాన్నంటుతున్నాయని, పెట్రోల్, డీజిల్, గ్యాస్, రైతులకు ఎరువులు అందుబాటులో లేవని సకాలంలో దొరక్క ఎక్కువ ధరలు వెచ్చించి అన్నదాతలు కొనుగోలు చేయాల్సి వస్తోందన్నారు. అన్నదాతలను ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందన్నారు. ఒక్క ఛాన్స్ అనే పేరుతో పంచాయతీలో ప్రజలందరు మోసపోయామని రాబోవు ఎన్నికల్లో రైతుల సత్తా ఏంటో చూపిస్తామని వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి పట్టం కట్టాలని గ్రామప్రజలను కోరారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు వేణురెడ్డి, ప్రతాప్, బాలాజీరెడ్డి, బాబురెడ్డి, సురేష్‌రెడ్డి, వెంకటయ్య, ప్రవీణ్‌చౌదరి, గోపి మరియు బిసి నాయకులు వెంకటరామన్, భాస్కర్, వెంకటరత్నం, జయచంద్ర, రాజ, సుబ్రమణ్యం, కుట్టి, మురళీ, మునస్వామి, బత్తెయ్య, శాంతి, శారద, ప్రేమ, రాణెమ్మ, గురమ్మ, రోజా, సరళ తదితర నాయకులు పాల్గొన్నారు.

## ముస్లిం మైనార్టీల ఆత్మీయ సదస్సు

**శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త**విజయవాడలోని ఓ ఫంక్షన్ హాలులో ముస్లిం మైనార్టీల ఆత్మీయ సదస్సు జరిగింది. కార్యక్రమానికి రాష్ట్రానికి సంబందించిన మైనార్టీ ముస్లిం ఛైర్మన్లు పాల్గొన్నారు. హార్‌దిల్ మే వైఎస్ఆర్, హమ్‌సబ్ జగన్ కే సాత్ అన్న నినాదంతో సమావేశాన్ని నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిధిగా ప్రభుత్వ సలహదారులు సజ్జలరామకృష్ణారెడ్డి, రాష్ట్ర మైనార్టీశాఖ మంత్రి అంజద్‌బాషాలు హాజరయ్యారు. వీరిని తిరుపతి జిల్లా వక్స్‌బోర్డు ఛైర్మన్‌షేక్ సిరాజ్‌బాషా దుశ్శాలువతో సత్కరించారు.

## మంత్రి సమక్షంలో వైసీపీలోకి చేరిన టీడీపీ మాజీ కౌన్సిలర్ సలీం



నగరి, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త:

మంత్రి రోజా సమక్షంలో నగరి మున్సిపల్ 23వ వార్డుకి చెందిన తెలుగుదేశంపార్టీమాజీకౌన్సిలర్ సలీం, టీడీపీ లీడర్ రఫీ అనుచరులు ఫైజిల్, భాస్కర్, సత్యవేల్‌రెడ్డి, దేవి, సాధిక్, ఈశ్వర్, అన్వర్, మణి, బిలాల్, నారాయణ, లక్ష్మి, అహ్మద్ వీరితో పాటు వంద మంది వైసీపీలో గురువారం చేరారు. మంత్రి రోజా వారికి కండువా కప్పి సాదరణ పార్టీలోకి ఆహ్వానించారు. నగరి నియోజకవర్గ అభివృద్ధికి మంత్రి చేస్తున్న కృషిని చూసి తెలుగుదేశం పార్టీనుంచి వైసీపీలోకి చేరినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో మండల మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌లు, కౌన్సిలర్లు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నిధులివ్వరు... పనులకు బిల్లులు ఇవ్వరు

**- తడ మండల సమావేశంలో సర్పంచుల ఆవేదన**

తడ, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త : గ్రామ పంచాయతీలుగా సర్పంచులు ఉత్సవ విగ్రహాలుగా మారిపోయామని తడ మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు గొంతెత్తారు. గురువారం జరిగిన 6వ మండల సర్వసభ్య సమావేశంలో పలువురు సర్పంచులు తమ సమస్యలు ఏకరువు పెట్టారు. నిధులు ఇవ్వడం లేదని, పనులు చేసినా బిల్లులు ఇవ్వడం లేదని, పంచాయతీల ఆదాయాలకు మించి కరెంటు బకాయిలు పేరుకుపోతున్నా యని సర్పంచులు గోడుమన్నారు. తమిళనాడు సరిహద్దుల్లో ఇసుక ట్రాక్టర్ రూ.10వేలకు కొంటున్నామని, ఇదెక్కడి న్యాయమని రాష్ట్ర సరిహద్దుల్లోని రామాపురం సర్పంచ్ టికె శ్రీనివాసన్ ఆవేదన వ్యక్తం చేశారు. టన్ను ఇసుక రూ.90 వేలు పలుకుతోందని, ఈ సమస్యను పరిష్కరించాలంటూ ఎన్నిసార్లు అధికారులకు విజ్ఞప్తి చేసినా ఫలితం లేకపోతోందన్నారు. దీనికి స్పందించిన తహశీల్దార్ ఎస్.రామయ్య తమిళనాడులోని తిరువళ్లూరు, తిరుపతి జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు ఈ సమస్యపై చర్చించినట్లు చెప్పారు. గ్రామాల్లో జరిగే అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాల గురించి అధికారులు, సచివాలయ ఉద్యోగులు కూడా తమకు చెప్పడం లేదని టికె శ్రీనివాసన్‌తో పాటు గ్రద్దగుంట సర్పంచ్ కుప్పంపాటి కాటయ్య పేర్కొన్నారు. విద్యుత్ బిల్లులు ఒక కోటి 4 వేలు చెల్లించాలని తమ పంచాయతీకి నోటీసులు వచ్చాయని, ఎప్పుడెప్పుడో ఉన్న బకాయిలను ప్రస్తుతం చెల్లించమనడం ఏమిటని రామాపురం సర్పంచ్ నిలదీశారు. తడ, తడకండ్రిగలతో పాటు పలు పంచాయతీలలో కరెంటు బిల్లులు పెద్దమొత్తంలో ఉన్నట్లు సంబంధిత ఏఇ మురళీ ఈ సందర్భంగా చెప్పారు. గృహ నిర్మాణ శాఖ ఏఇ సత్యనారాయణ మాట్లాడుతూ నూతనంగా 1184 ఇళ్లు కావాలని దరఖాస్తులు అందినట్లు చెప్పారు. నీటిపారుదలశాఖలో చేసిన వరద పనులకు సంబంధించి ఇప్పటికీ బిల్లులు




ఇవ్వలేదని అధికార పార్టీకి చెందిన వెండ్లూరుపాడు సర్పంచ్ చిల్లకూరు మునిరత్నంరెడ్డి సభ దృష్టికి తీసుకొచ్చారు. తాను మూడు మండల సమావేశాల్లో చెప్పినా ఒక్క టీచర్ నియామకం జరగలేదని తడ వైసీపీ నేత, సర్పంచ్ కె. ఆర్ముగం పేర్కొన్నారు. 60 మంది పిల్లలకు ఒకే ఒక్క టీచర్ ఉన్నారని, తరచూ తమ పాఠశాల మూతపడుతోందన్నారు. ఇన్‌ఛార్జ్ ఎంఇఓ ఇందిర త్వరలోనే నియామకం చేస్తామని మరోసారి హామీ ఇచ్చారు. మండలాధ్యక్షుడు కొళవి రఘురెడ్డి, ఉపాధ్యక్షులు కుప్పంపాటి వెంకటేష్, సిహెచ్ రమేష్, ఎంపిడిఓ ఎవి మురళీకృష్ణ, తహశీల్దార్ ఎస్.రామయ్య, పంచాయితీరాజ్ డిఇ బి.రమణయ్య లతో పాటు పలు శాఖల అధికారులు, పంచాయతీ సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు. మండలంలోని కొన్ని గ్రామాల ప్రజాప్రతినిధులకు బదులుగా వారి భర్తలు, కుటుంబ సభ్యులు హాజరై మండల సమావేశంలో మాట్లాడటంతో గందరగోళానికి దారితీసింది.

# శరవేగంగా మాస్టర్ ప్లాన్ పనులు

**తిరుపతిలో ట్రాఫిక్ కష్టాలు ఉండవు. మేయర్,కమిషనర్, ఉప మేయర్**

తిరుపతి కార్పొరేషన్, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త : నగర ప్రజల ట్రాఫిక్ కష్టాలు తీర్చడం కోసమే మాస్టర్ ప్లాన్ రోడ్లను శరవేగంగా పూర్తి చేస్తున్నామని నగర పాలక సంస్థ మేయర్ డా. శిరీష అన్నారు. నగర అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్న నగర పాలక కౌన్సిల్ నిర్ణయాలకు సహకరించి తిరుపతి ట్రాఫిక్ కష్టాలు తీరడం కోసం ప్రధాన మాస్టర్ ప్లాన్ రోడ్ల నిర్మాణం కొరకు సహకరిస్తున్న ప్రజలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. అందరి సహకారంతోనే నేడు మాస్టర్ ప్లాన్ రోడ్డు పూర్తికావస్తున్నాయని అన్నారు. నగరంలో ఏర్పాటు చేస్తున్నప్రధాన మాస్టర్ ప్లాన్ రోడ్లను గురువారం కమిషనర్ హరికృష్ణ, ఉపమేయర్లు భూమన అభినయ్, ముద్ర నారాయణ, కార్పొరేటర్లు, అధికారులతో కలిసి మేయర్ డా. శిరీష రోడ్డు విస్తరణ జరుగుతున్న సందర్భంగా కాలినడకన రోడ్డు పనులు పరిశీలిస్తూ నగర అభివృద్ధికి తోడ్పడాలని ప్రజల్ని కోరారు. కమిషనర్ హరికృష్ణ మాట్లాడుతూ నగరంలో మాస్టర్ ప్లాన్ రోడ్లు చూశాక తనవంతు నగర పాలక, తుడా ద్వారా అభివృద్ధిలో సహాయ, సహకారాలు అందిస్తానని ఈ సందర్భంగా తెలిపారు. నగరంలో ఏర్పాటు చేస్తున్న మాస్టర్ ప్లాన్ రోడ్ల వలన ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు తీరడమే కాకుండా సమయం ఆదా అవుతుందన్నారు. ఉప మేయర్ భూమన అభినయ్ మాట్లాడుతూ నగర ప్రజలు సహకారంతోనే మాస్టర్ రోడ్డులు పూర్తి చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రతిరోజు అధికారులతో పర్యటిస్తూ మాస్టర్ ప్లాన్ రోడ్లన్నీ పూర్తి చేసి దానికి నాయకులు, నగర



ప్రజలు, సహకారంతోనే త్వరగా పూర్తి చేస్తున్నామని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ఉప మేయర్ ముద్ర నారాయణ, అదనపు కమిషనర్ సునీత, కార్పొరేటర్లు రామస్వామి, వెంకటేశ్వర్లు, అమర్నాధ్ రెడ్డి, నరేంద్ర, తమ్ముడు గణేష్, ఉమా అజయ్, అనిల్ కుమార్, కోఆప్షన్ సభ్యులు ఇమామ్, అధికారులు ఎంఈ వెంకట్ రామిరెడ్డి, డిఈ విజయ్ కుమార్ రెడ్డి, ఏసిపి షణ్ముగం, టిపిఓలు, సర్వేర్లు దేవానంద్, మురళి తదితరులు పాల్గొన్నారు.

## అతిథులకు సంప్రదాయాలు చెప్పాలి!

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాయంలో అమలు చేస్తున్న పలు నిబంధనలకు సంబందించి నిత్యం ఆలయంలో సంచరించే ఉద్యోగులకే తెలియటం లేదు.మరి సామాన్య భక్తుల మాటేమిటన్నది చర్చనీయాంశంగా మారింది.ఇటీవల శ్రీకాళహస్తీశ్వ రాలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ దేవాదాయశాఖ స్వామి అమ్మవార్ల అంతరాలయ ధర్శనానికి 'సంప్రదాయ దుస్తులు తప్పని సరి అని' నిర్ణయించారు. బుధవారం శ్రీకాళహస్తీశ్వరాలయానికి శివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లుపై ముందస్తు సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఏర్పాట్లును సమీక్షించిన జిల్లా ఎస్పి ఆయన సహచర ఉద్యోగులు స్వామి అమ్మవార్ల దర్శనానికి వచ్చారు. అయితే వారు ప్యాంట్లుతో ప్రవేశించారు. దాంతో చూసిన వారు నివ్వెర బోయారు. అధికారులకు ఆలయ ఆచార వ్యవహారాలు వర్తించవా? అని ముక్కున వేలేసుకున్నారు. అయితే ఆ అధికారులు ఆలయం అంతరాలయంలో ప్రవేశించిన సమయం లో వారితో పాటు ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు కూడా ఉండటం గమనించ దగ్గ విషయం.ఆలయంలో సంస్కరణలు, కొన్ని నిర్ణయాలు తీసుకున్నపుడు ఇక్కడకు వచ్చిన అతిధులకు ముందుగానేసమాచారం ఇవ్వాలి. కానీ శ్రీకాళహస్తీశ్వరాలయంలో ప్రవేశ పెట్టె సంస్క రణలు కేవలం భక్తులకు, మీడియాకు మాత్రమే అన్నట్లు మారింది.ఇప్పటికైనా విఐపిలకు ఇక్కడి సంప్రదాయాలు నిబంధనలకు సంబంధించి ముందుగానే సమాచారం ఇస్తే బాగుంటుందనే అభిప్రాయం వ్యక్తమౌతుంది.

## పుత్తూరు కోర్టుకు హాజరైన టిడిపి నేత ఉండవల్లి అనూష

పుత్తూరు, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త : తెలుగుదేశం పార్టీ ఐటిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి ఉండవల్లి అనూష గురువారం పుత్తూరు కోర్టుకు హాజరయ్యారు. గతంలో మంత్రి రోజాపై ఆమె చేసిన వ్యాఖ్యలపై పుత్తూరు పోలీసులు పెట్టిన కేసుకు సంబంధించి ఆమె కోర్టుకు రాగా, కేసు ఏప్రిల్ 11వ తేదీకి వాయిదా పడింది. ఈ సందర్భంగా చిత్తూరు పార్లమెంట్ బిసి సెల్



అధ్యక్షుడు సిహెచ్.షణ్ముగరెడ్డి అనూషను శాలువా, పూలమాల, బొకేలతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తమ నాయకుడు లోకేష్‌బాబుపై మంత్రి రోజా వ్యక్తిగత దూషణలు చేస్తున్నందున మంత్రి రోజా గతం గుర్తుకు తెచ్చుకోవాలని, సమాజంలో ఒక స్థాయిలో వున్నపుడు తగిన విధంగా మాట్లాడాలని, మనల్ని మన పిల్లలు అసహ్యించుకునే విధంగా ప్రవర్తించకూడదని అన్నారు. కోర్టులో కేసు వున్నందున దానిపై ఏ కామెంట్ చేయనని, న్యాయ పోరాటం చేస్తానని, తనకు న్యాయం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ ఉపాధ్యక్షుడు ఏలుమలైరెడ్డి, తెలుగు యువత అధ్యక్షుడు హరి, ఇంకా నవీన్, మణిరెడ్డి, మహేష్‌కుమార్, మోహిత్ తదితరులు పాల్గొన్నారు.

## వేడుకగా ప్రారంభమైన టిటిడి ఉద్యోగుల క్రీడలు

తిరుమల/తిరుపతి, ఫిబ్రవరి 2 ప్రభాతవాం ్త ప్రతినిధి: టిటిడి ఉద్యోగుల వార్షిక క్రీడోత్సవాలు గురువారం ఉదయం అట్టహాసంగా ప్రారంభమ య్యాయి. టిటిడి పరిపాలన భవనం ప్రాంగణం లోని మైదానంలో ఈ క్రీడలను టిటిడి ఇఓ ఏవిధర్మారెడ్డి, జెఇఓలు సదాభార్గవి, వీరబ్రహ్మం, ఎస్వీబిసి సిఇఓ షణ్ముఖకుమార్ పావురాలు



ఎగురవేసి లాంఛనంగా బెలూన్లను ఊపి ప్రారంభించారు. 2వతేదీ ప్రారంభమైన క్రీడల పోటీలు 19వ తేదీ వరకు పలు రకాల క్రీడాంశాల్లో ఉద్యోగులు పాల్గొంటూన్నారు. విధి నిర్వహణలో పలు రకాల ఒత్తిళ్ళకు గురయ్యే ఉద్యోగులు ప్రతిరోజూ యోగా, ధ్యానం, ఆటలు, వ్యాయామం చేయడం ద్వారా శారీరక మానసిక ఒత్తిడి నుంచి ఉపశమనం లభిస్తుందని ఇఓ తెలిపారు. పోటీగా గాకుండా ఆటలు ఆడాలనే స్ఫూర్తితో పాల్గొనాలని పిలుపునిచ్చారు. అంతకుముందు క్రీడాకారులైన ఉద్యోగులను పేరు పేరునా పరిచయం చేసుకుని ఇఓ ధర్మారెడ్డి గౌరవవందనం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో టిటిడి సిఇ నాగేశ్వరరావు, విజిఓ మనోహర్, సంక్షేమ విభాగం డిప్యూటీ ఇఓ స్నేహలత, ఉద్యోగులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## ఉత్కంఠ భరితంగా సీఆర్ఎస్ రైల్వే ఇన్‌స్టిట్యూట్ ఎన్నికలు



రేణిగుంట, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త: రేణిగుంట (తిరుపతి) సీఆర్ఎస్ రైల్వే ఇన్‌స్టిట్యూట్ కార్యవర్గ ఎన్నికలు గురువారం ఉత్కంఠగా జరిగాయి. 898 ఓటర్లు ఓటు హక్కు వినియోగిం చుకోవలసి ఉండగా 850 మంది ఓట్లు వేశారు. రెండు ప్రధాన యూనియన్లు మరో ఇండిపెండెంట్ ప్యానల్ అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉన్నారు. మధ్యాహ్నం వరకు ఎన్నికలు ఉత్కంఠ భరితంగా జరిగాయి. మధ్యాహ్నం నుంచి ఎన్నికల లెక్కింపు ప్రశాంతంగా జరుగుతుంది. మజ్దూర్ యూనియన్‌కు జెండా గుర్తు, సంఘ్‌కు సింహం గుర్తు, ఇండిపెండెంట్ ప్యానెల్‌కు పెన్ను గుర్తును కేటాయించారు. ఒక్కొక్క ప్యానెల్ నుంచి 6 మంది కార్యవర్గ సభ్యులు బరిలో ఉన్నారు. మరో ఇండిపెండెంట్ అభ్యర్థి ఉదయించే సూర్యుని గుర్తుపై పోటీ చేస్తున్నారు. మూడు ప్యానెల్ నుంచి కార్యదర్శి, ఉప కార్యదర్శి, కోశాధికారి, పదవులకు కార్యవర్గ సభ్యులకు లెక్కింపు జరుగుతోంది. మజ్దూర్ యూనియన్ నుంచి కార్యదర్శిగా హెన్రీపాల్, ఉప కార్యదర్శిగా శ్రీకాంత్, కోశాధికారిగా మునికుమార్, సంఘ్ నుంచి కార్యదర్శిగా పవన్‌కుమార్, ఉప కార్యదర్శిగా దేవలం రాజేష్, కోశాధికారిగా ప్రసాద్, ఇండిపెండెంట్ ప్యానెల్ నుంచి కార్యదర్శిగా త్రిమూర్తులు, ఉప కార్యదర్శిగా దిలీప్‌కుమార్, కోశాధికారిగా భక్తవత్సలం బరిలో ఉన్నారు. పోలింగ్ ఆఫీసర్ అరుణ్‌కుమార్, కౌంటింగ్ ఆఫీసర్ దాస్య నాయక్ కట్టుదిట్టంగా ఎన్నికలు నిర్వహిస్తున్నారు. తిరుపతి ఐపీఎఫ్ మధుసూదన్ దేశాల మేరకు ఆర్పీఎఫ్ ఎస్ఐ మోహన్‌రావు తమ సిబ్బందితో భద్రత చర్యలు చేపట్టారు. తుది ఫలితాలు వెలువడానికి అర్ధరాత్రి వరకు సమయం పడుతుందని అధికారులు తెలిపారు.

# ప్రైవేటు స్కూల్స్ ఉపాధ్యాయులకు ఈపీఎఫ్ సౌకర్యం కల్పించాలి

వెంకటగిరి, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త: ప్రైవేటు పాఠశాల ఉపాధ్యాయులకు ఈపీఎఫ్, ఈహెచ్ఎస్ సౌకర్యం కల్పించేందుకు కృషి చేస్తానని గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి మీగడ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. వెంకటగిరి ప్రాంతంలోని వివిధ ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులను కలిసి ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ శాసనమండలిలో పీడీఎఫ్ ఎమ్మెల్సీలు కేవలం ప్రభుత్వ ఉపాధ్యాయుల సమస్యల కోసమే కాదు, ప్రైవేటు రంగంలో పని చేస్తున్న ఉపాధ్యా



యులు, అధ్యాపకు లకు మెరుగైన సేవలు ప్రభుత్వం నుంచి అందేలా కృషి చేస్తున్నారు. ఆ కృషిని నేను కొనసాగిస్తానని తెలియజేస్తున్నానన్నారు. రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలకు ధీటుగా ప్రైవేటు పాఠశాలల్లో ఉపాధ్యాయులు పని చేస్తున్నారన్నారు. 70 శాతం పైగా ఉన్నత విద్యా సంస్థలలో అధ్యాపకులు పని చేస్తున్నారన్నారు. ఉన్నత చదువులు చదివిన వీరికి కనీస సౌకర్యాలు అందుబాటులో లేవన్నారు. ఆ సమస్యలు పరిష్కారం కోసం చిత్తశుద్ధితో కృషి చేస్తానని తెలియజేస్తున్నానన్నారు. చిన్న చిన్న పరిశ్రమల్లో పని చేసే కార్మికులను ప్రభుత్వం గుర్తించి వారికి గుర్తింపు కార్డులు ఇస్తుందన్నారు. ఈపీఎఫ్, ఈహెచ్ఎస్ సౌకర్యం చేస్తానని తెలిపారు. కానీ ప్రైవేటు ఉపాధ్యాయులకు ఇవేమీ లేవన్నారు. ఉద్యోగ భద్రత లేదన్నారు. అందుకే ప్రతి ప్రైవేటు స్కూల్‌కు ఈ రోజు ప్రభుత్వ గుర్తింపు ఉందన్నారు. నమోదైన ఉపాధ్యాయులు అందరికీ ప్రభుత్వం గుర్తింపు నెంబరు ఇవ్వాలని, ఆ గుర్తింపు నెంబరు పొందిన అందరూ ఉపాధ్యా యులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ప్రభుత్వ గుర్తింపు పొందిన అందరూ ఉపాధ్యాయులకు ప్రభుత్వం సౌకర్యం కల్పించాలని, సౌకర్యం పొందిన వారు ఏదైనా కారణాలతో చనిపోతే ఆ కుటుంబానికి రూ. 7.5 లక్షలు ఇన్సూరెన్స్ వస్తుందన్నారు. గుర్తింపు పొందిన ప్రతి ఉపాధ్యాయునికి ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయుల వలె ఈహెచ్ఎస్ వర్తింపజేయాలని ప్రభుత్వము, మేనేజ్‌మెంట్ ఇద్దరి సహకారంతో రూ.1000 కోట్లతో వీరి సంక్షేమం కోసం సంక్షేమ నిధిని ఏర్పాటు చేసి అత్యవసరం చేయాలన్నారు. ఆయన వెంట ఉపాధ్యాయ సంఘం నాయకులు ఉన్నారు.

## శ్రీసిటీని సందర్శించిన ప్రముఖ వైద్యులు జీరెడ్డి ప్రసాద్



సత్యవేడు, ఫిబ్రవరి02,ప్రభాతవార్త: అమెరికా కాలిఫోర్నియాకు చెందిన ప్రముఖ ఎండోక్రినాలజిస్ట్, ఫుట్‌హిల్ అకౌంటబుల్‌కేర్ అడ్మిన్స్ అధ్యక్షుడు డాక్టర్ జీరెడ్డి ప్రసాద్ గురువారం శ్రీసిటీని సంద ర్శించారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఆయనకు సాదర స్వాగతం పలికి ఇక్కడి ప్రపంచస్థాయి మౌళిక సదుపాయాలు, పారిశ్రామిక ప్రగతి, ప్రత్యేకతలు, ఉద్యోగ అవకాశాలను వివరించారు. శ్రీసిటీ ప్రాజెక్టు అమలుతీరుపై సంతృప్తి చెందిన డాక్టర్ జీరెడ్డి, శ్రీసిటీ టీమ్ వర్క్‌ను ప్రశంసించారు. వెనుకబడిన ప్రాంతాన్ని మోడల్ ఇండస్ట్రీయల్ పార్కుగా అభివృద్ధి చేయడంలో శ్రీసిటీ మేనేజ్‌మెంట్ చేస్తున్న కృషిని, అలాగే ఈప్రాంత ప్రజలకు, ముఖ్యంగా మహిళలకు తగినంత ఉద్యోగఅవకాశాలు కల్పించడంపై అభినందనలు తెలిపారు. ప్రపంచస్థాయి పారిశ్రామిక నగరాన్ని నిర్వహించడం అంతతేలిక కాదన్న ఆయన, దేశంలోనే అత్యంత ప్రభావశీలమైన పెట్టుబడి కేంద్రంగా శ్రీసిటీని అభివృద్ధి చేసినందుకు డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డిని ప్రత్యేకంగా అభినందించారు. ఈసందర్భనపై డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి స్పందిస్తూ డాక్టర్ జీరెడ్డి ప్రసాద్ పర్యటనను తాము గౌరవప్రదంగా భావిస్తున్నామని పేర్కొన్నారు. ఆయన సూచనలు, అభిప్రాయాలు తమకు ఎంతగానో సహాయపడుతాయన్నారు. ఈప్రాంతంతోని నిరుపేద జనాభాకు వైద్య సేవలను మెరుగుపరచాల్సిన ఆవశ్యకతను వివరిస్తూ , ఈప్రాంతంలో మౌళిక వైద్య సదుపాయాలను మెరుగుపరచడానికి సహకరించాలని కోరారు.

## విత్తనాలు, ఎరువులు పరీక్షించి వినియోగించాలి

నగరి, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త: విత్తనాలు, ఎరువులను ప్రభుత్వం ఏర్పాటు చేసిన అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌ల ద్వారా పరీక్షించి నాణ్యమైన విత్తనాలు, ఎరువులు వాడుకోవాలని అసిస్టెంట్ కలెక్టర్ మేఘస్వరూప్ అన్నారు. గురువారం నగరి మార్కెట్‌యార్డులోని డాక్టర్ వైఎస్ఆర్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌ను ఆయన సందర్శించారు. ల్యాబ్ లో విత్తనాలు, ఎరువులను పరీక్షించి విధానాన్ని క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు



ల్యాబ్‌లో 181 విత్తన శాంపిల్స్‌ను, 97 ఎరువుల శాంపిల్స్‌ను పరీక్షించినట్లు ల్యాబ్ ఏవో యామిని కలెక్టర్‌కు తెలియజేశారు. టెస్టింగ్ రిపోర్టులను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి అబీబ్ బాషా, చిత్తూరు డివిజన్ ఏడీఏ మధుసూదన్, నగరి డివిజన్ ఏడీఏ సౌభాగ్యలక్ష్మి, ల్యాబ్ అనాలసిస్ట్ తులసి జలంధర్, సెంధామరమ్ తదితరులు పాల్గొన్నారు.

## గడప గడపకు సంక్షేమ ఫలాలు : నారాయణస్వామి



వెదురుకుప్పం, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త :గడప గడపకు ఇంటి తలుపు తట్టి సంక్షేమ ఫలాలు అందించడం కేవలం రాష్ట్ర ముఖ్య మంత్రి జగన్మోహన్ రెడ్డికే సాధ్యమవుతుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళాత్తూరు నారాయణస్వామి పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గరువారం పెరుమాళ్ళ పల్లె సచివాలయం పరిధిలోగల గొడుగుచింత పరిధిలో గల సోమేంద్రపురం,చవనపల్లె, గొడుగు చింత. తార్లబయలు గ్రామాల్లో గడప గడపకు వెళ్ళి ప్రజా సమస్యలు తెలుసుకుని, అభివృద్ధి సంక్షేమ ఫలాల అమలు తీరును ప్రశ్నించి తెలుసుకుని, ప్రభుత్వం అందిజేస్తున్న సంక్షేమ పథకాల కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి దిశగా నిరంతరం కృషి చేస్తున్న యవనేతను ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ నక్కా బాబు, ఎంపిటిసి తోకలమురళీ రెడ్డి, ఎంపిడివో సుధాకర్‌రావు, తహశీల్దార్ పుల్లారెడ్డి, సచివాలయ సిబ్బంది, జడ్పీటిసి చలంపాళ్యం సుకుమార్, వైసీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బండి హేమసుందర్ రెడ్డి, జిల్లా వైసీపీ కార్యదర్శి కామసానిపద్మనాభ రెడ్డి, నాయకులు బట్టే సుబ్ర మణ్యం,రామయ్య,ధనంజేయులురెడ్డి, ఆనందరెడ్డి, పరందామరెడ్డి, షణ్ముగంరెడ్డిలు పాల్గొన్నారు.

## నారా లోకేష్ బహిరంగ సభకు ఏర్పాట్లు



పాలసముద్రం, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త: జిడినెల్లూరు నియోజకవర్గం పాలసముద్రం మండలం ఆముదాల గ్రామ సమీపంలో 9వ తేదీ జరుగనున్న జాతీయ తెలుగుదేశం ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ బహిరంగ సభకు తెలుగుదేశం పార్టీ నాయకులు భారీ ఏర్పాట్లు చేపట్టారు. ఈ నెల 8వ తేదీ నారా లోకేష్ జిడినెల్లూరులో రాత్రి బస చేసి 9వ తేదీ ఉదయం పాదయాత్రం ప్రారంభించి సాయంత్రం 3 గంటలకు ఆముదాల పంచాయతీ రంగాపురం క్రాస్‌కు చేరుకొని అక్కడ జరిగే బహిరంగ సభలో నారా లోకేష్ పాల్గొంటారు. ఇక్కడ సభ సాఫీగా నిర్వహించడానికి తెలుగుదేశం నాయకులు రెండు ఎకరాల స్థలంను ఎంపిక చేసి చదును చేసే కార్యక్రమం చేపట్టారు. జిడినెల్లూరు నియోజకవర్గ దేశం కో-ఆర్డినేటర్ భీమినేని చిట్టిబాబు పర్యవేక్షణలో నియోజకవర్గ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి ఆరుళ్‌నాథన్, మండల తెలుగురైతు అధ్యక్షుడు మణినాయుడు, గ్రామ కమిటీ అధ్యక్షుడు ఆదికేశవులునాయుడు, సీనియర్ టిడిపి నాయకుడు భక్తవత్సలం నాయుడుల ఆధ్వర్యంలో పనులు జరుగుతున్నాయి.

## 11 నుండి కల్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలు

చంద్రగిరి, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త: శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న శ్రీకల్యాణ వెంకటేశ్వరస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 11 నుండి ప్రారంభమవుతాయని టిటిడి జెఈఓ వీరబ్రహ్మం తెలిపారు. తిరుపతి, టిటిడి పరిపాలనా భవనంలో గురువారం బ్రహ్మోత్సవాల పోస్టర్లు, ఆవిష్కరించారు. కోవిడ్ కారణంగా రెండేళ్ళపాటు బ్రహ్మోత్సవాలు నిలిపివేశారు. ఈ ఏడాది



కల్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలలో స్వామి వారి వాహన సేవలు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. 11న ఉదయం 8.40 గంటల నుండి 9 గంటల మధ్యన ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. 15న రాత్రి గరుడ వాహనసేవ, 16న సాయంత్రం 4 గంటలకు బంగారు రథోత్సవం, 18న రథోత్సవం, 19న చక్రస్నానం నిర్వహించనున్నట్లు తెలిపారు. బ్రహ్మోత్సవాలలో ఉదయం 8గంటల నుండి 9గంటల వరకు, రాత్రి 8గంటలకు ఆలయ మాడవీధులలో వాహన సేవలు జరుగుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, సూపరింటెండెంట్ ముని చెంగల్రాయులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, అర్చకులు పాల్గొన్నారు.

## శివయ్య సేవలో బిక్షమయ్య గురూజీ



శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 2 ప్రభాతవార్త : దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి గాంచిన శ్రీకాళహస్తీశ్వరాలయానికి గురువారం సత్యసేవక్, ప్రేమారంవింద పూజ బిక్షమయ్య గురూజీ విచ్చేసారు.వారికి దక్షిణ గోపురం వద్ద ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు వేదపండితులతో స్వాగతం పలికారు. స్వామి అమ్మవార్లను దర్శించుకున్న ఆయనకు గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద వేదపండితులచే ప్రత్యేకాశీర్వచ నాలు అందించారు.ఈ కార్యక్రమాల్లో చైర్మెన్ తో పాటు మాజీ కౌన్సిలర్ కళ్యాణమ్మ, ఆలయాధికారులు శ్రీనివాసరాజు, శ్రీహరి, రాజశేఖర్‌తదితరులున్నారు.

## స్విమ్స్‌లో 4న ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం

తిరుపతినగరం,ఫిబ్రవరి 2,ప్రభాతవార్త: శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (సిమ్స్) నందు 4వ తేదీ శనివారం ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సంచాలకులు మరియు ఉపకులపతి డాక్టర్ బి.వెంగమ్మ తెలిపారు. ఈ కార్యక్రమాలకు టిటిడి ఇవో ఎ.వి.ధర్మారెడ్డి, కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి, టిటిడి జెఇవో సదా భార్గవి, వేదిక్ యూనివర్శిటీ ఉపకులపతి ఆచార్య రాణిసదాశివమూర్తి పాల్గొంటారని అన్నారు. ఆ రోజు ఉదయం వైద్య విద్యార్థులచే స్విమ్స్ నుండి మహతి ఆడిటోరియం వరకు ర్యాలీ, కేర్ ట్రాకర్ యాప్ ప్రారంభం, క్యాన్సర్ వ్యాధి నిర్మూలపై పోస్టర్ ప్రదర్శన, నూతనంగా నిర్మించిన పెయిన్ అండ్ పాలివేటివ్ ఆంకాలజీ వింగ్ ప్రారంభోత్సవం, తదిపరతి మహతి ఆడిటోరియంలో క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కార్యక్రమం జరుగుతుందన్నారు.

# ఏపీకి మరోసారి మొండిచేయి

**- కేంద్ర బడ్జెట్‌పై సీపీఐ ఆగ్రహం**
**- బడ్జెట్ ప్రతులను దహనం చేసిన సీపీఐ నాయకులు**



గూడూరు, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త : కేంద్ర ఆర్థికశాఖ మంత్రి ప్రకటించిన బడ్జెట్‌లో ఈ సారి కూడా ఏపీకి అన్యాయం చేశారని సీపీఐ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం గూడూరు పట్టణంలోని టవర్ క్లాక్ సెంటర్‌లో ఉన్న అంబేద్కర్ విగ్రహం ఎదుట కేంద్ర బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సిహెచ్ ప్రభాకర్ మాట్లాడుతూ గత నాలుగేళ్లుగా కేంద్రం ప్రవేశపెడుతున్న బడ్జెట్‌లో ఆంధ్ర రాష్ట్రానికి అన్యాయం జరుగుతూనే ఉందన్నారు. బుధవారం ప్రవేశపెట్టిన కేంద్ర వార్షిక బడ్జెట్‌లో ఏపీకి పాలకులు మరోసారి అన్యాయం చేశారన్నారు. పోలవరానికి నిధులు కేటాయించలేదన్నారు. ప్రత్యేక హోదా ఊసే లేదన్నారు. కనీసం ప్రత్యేక ప్యాకేజికి కూడా నిధులు కేటాయించకపోవడం దారుణమన్నారు. దీన్ని సీపీఐ, వ్యవసాయ కార్మిక సంఘం, ఏఐటియుసి తరపున తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సీపీఐ గూడూరు డివిజన్ కార్యదర్శి జి.శశికుమార్ మాట్లాడుతూ కేంద్రం రాష్ట్రానికి మరోసారి మొండిచేయి చూపడం దారుణమన్నారు. సీపీఐ పట్టణ కార్యదర్శి షేక్ కాలేషా మాట్లాడుతూ బిజెపి రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తూ అదాని, అంబానీ లాంటి కార్పొరేట్ శక్తులకు తొత్తులుగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏఐటియుసి నియోజకవర్గ కార్యదర్శి ఎంబేటి చంద్రయ్య మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ ఆమోదయోగ్యం కాదన్నారు. ఇన్సాఫ్ సమితి రాష్ట్ర ఉప కార్యదర్శి షేక్ జమాలుల్లా మాట్లాడుతూ 2023-24 బడ్జెట్‌లో మైనారిటీలకు అన్యాయం చేశారన్నారు. మైనారిటీల ఉపకార వేతనాలను రద్దు చేయడం, మౌలానా అబుల్‌కలామ్ నేషనల్ ఫెలోషిప్‌ను తొలగించడం చూస్తుంటే మైనారిటీలను విద్యకు దూరంచేయడమే ప్రభుత్వ లక్ష్యంగా కనిపిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు సిహెచ్ ప్రభాకర్, జి.శశికుమార్, షేక్ కాలేషా, రమేష్, గౌస్‌బాషా, ఏఐటియుసి నాయకులు ఎంబేటి చంద్రయ్య, కె.నారాయణ, ఇన్‌సాఫ్ రాష్ట్ర ఉప కార్యదర్శి షేక్ జమాలుల్లా, మున్సిపల్ వర్కర్లు యాకోబు తదితరులు పాల్గొన్నారు.

## పొదుపు పథకాలున్నవారికి పాత పన్నువిధానం మంచిది

తిరుపతి,ఫిబ్రవరి 2ప్రభాతవార్త: పొదుపు పథకాలలో పెట్టుబడి పెట్టిన వారికి పాత పన్ను విధానం మంచిదని, సేవింగ్స్ అంతా లేనివారు కొత్తవిధానానికి మారవచ్చని ఛార్టెడ్ అకౌంటెంట్ వి.భాగ్యతేజ తెలిపారు. పిఆర్ ఎస్ఐ తిరుపతి ఛాప్టర్, క్రెడాయ్ తిరుపతి ఛాప్టర్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం



బడ్జెట్ 2023పై అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి వక్తలుగా విచ్చేసిన భాగ్యతేజ, తిరుపతి భారతీయ విద్యాభవన్ డైరెక్టర్ సత్యనారాయణరాజు మాట్లాడుతూ 45లక్షల కోట్ల రూపాయలతో కేంద్రప్రభుత్వం బడ్జెట్ ప్రవేశ పెట్టిందని, ఇందులో ఆదాయం వచ్చే మార్గాలు, చెల్లించాల్సిన ఖర్చులు గురించి తెలిపారు. ఈ బడ్జెట్‌లో మార్కెట్లో నగదు ప్రవాహాన్ని పెంచేందుకు ఎక్కువ ప్రాధాన్యతనిచ్చారని తెలిపారు. రైతు సంక్షేమం కోసం తగినన్ని నిధులు కేటాయిస్తే నిజమైన బడ్జెట్ ప్రవేశపెట్టినట్లు అని చెప్పారు. మాజీ ప్రధాని పివి నరసింహారావు హయాంలో ఆర్థిక సంస్కరణలు మొదలయ్యాయని, ఇప్పటికీ కొనసాగుతున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో పిఆర్ఎస్ఐ తిరుపతి ఛాప్టర్ అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు, కార్యదర్శి దుద్యాల చంద్రమోహన్, కోశాధికారి ఆచార్య చక్రవర్తి రాఘవన్, క్రెడాయ్ తిరుపతి ఛాప్టర్ ఛైర్మన్ ఎం.రాంప్రసాదరావు, అధ్యక్షుడు ఎస్.రాజశేఖర్‌గుప్తా, పిఆర్ఎస్ఐ వ్యవస్థాపక అధ్యక్షుడు రమాకాంత్‌శర్మ, కార్యవర్గసభ్యులు ఆర్‌సికె రాజు, మాజీ ఛైర్మన్‌లు డాక్టర్ ఎన్‌బి సుధాకర్‌రెడ్డి, డాక్టర్ స్వరాజ్యలక్ష్మి, ఆకాశవాణి విశ్రాంత సంచాలకులు మల్లేశ్వరరావు పాల్గొన్నారు.